ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 5 జూలై 2025

ఎంఈఓల మెడపై హాజరు కత్తి..!

ఇక రోజూ 9 గంటలకే ముఖ హాజరు


పాఠశాల తనిఖీ తప్పనిసరి

కమిషనరేట్ నుంచే జీపీఎస్‌తో ఆరా



అనంతపురం విద్య, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారులు ఇక నుంచి ఉదయం 9 గంటలకే ముఖ హాజరు వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఎప్పుడంటే అప్పుడు వెళ్లి రావచ్చనే వారికి ఇక చెక్ పడనుంది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకే ఎంఆర్‌సీలకు వెళ్లి ఆన్‌లైన్‌లో ముఖ హాజరు వేయాలి. ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేయాల్సిందే. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. అసలు కథలోకి వెళితే... పాఠశాలల పర్యవేక్షణ, విద్యా పథకాల అమలు, హెచ్‌ఎంలు, టీచర్ల పనితీరు, ప్రమాణాలను పర్యవేక్షించడానికి మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఎంఈఓ)ను ముందు నుంచి నియమించారు. వైసీపీ పాలనలో ప్రతి మండలానికి ఎంఈఓ-2ను నియమించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 63 మండలాలకు ఇద్దరిద్దరు ఉన్నారు. అయినా పాఠశాలల పర్యవేక్షణ గాడిన పడలేదు. పైగా ఇద్దరు ఎంఈఓలు ఉండడంతో అనేక మండలాలలో ఆధిపత్యపోరు మొదలయింది. ఇంకోవైపు చాలామంది ఎంఈఓలు స్థానికంగా ఉన్న మండలం, నియోజకవర్గ కేంద్రాలలో ఉండడంలేదు. జిల్లా

(మిగతా 7లో...)



క్రిష్ణంరెడ్డిపల్లి క్రాస్‌లో వేసిన లేఅవుట్

ఇప్పుడెలా?

బిల్డింగ్ అప్రూవల్స్ బంద్

సైటును నిలిపేయించిన అహుడా

మూడు నెలల నుంచి ఇదే దుస్థితి

పంచాయతీల ఆదాయానికి భారీ గండి

ఆర్థిక ఇబ్బందుల్లో స్థానిక సంస్థలు

అనంతపురం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో బిల్డింగ్ అప్రూవల్స్ బంద్ అయ్యాయి. దీంతో అసలే నిధులు లేక అల్లాడుతున్న పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నుంచి అహుడా అధికారులు పంచాయతీ అప్రూవల్ బిల్డింగ్ ఆన్‌లైన్ సైట్‌ను నిలిపేశారు. ఫలితంగా బిల్డింగ్ అప్రూవల్స్ ప్రక్రియ పూర్తిగా ఆగిపోయింది. ఈక్రమంలో పంచాయతీకి అప్రూవల్స్ ద్వారా వచ్చే నిధులకు గండి పడింది. దీంతో నిధులు లేక స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అవస్థలు పడుతున్నారు. ఇంటి పన్ను కూడా అంతంతమాత్రంగానే వసూలు అవుతోంది. దీంతో నిధులు లేక పంచాయతీల్లో చిన్నిచిన్న పనులు కూడా చేయలేకపోతున్నారు. పంచాయతీ బిల్డింగ్ అప్రూవల్ సైట్ నిలుపుదల వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ లే అవుట్ల నియంత్రణ పేరిట..

అక్రమ లేఅవుట్ల నియంత్రణ కోసమే అహుడా అధికారులు పంచాయతీలకు బిల్డింగ్ అప్రూవల్స్ నిలిపివేసినట్లు సమాచారం. కొత్తగా వెలుస్తున్న లేఅవుట్ల విషయంలో అహుడా అధికారులు నిబంధనలు అమలు చేస్తే ఉపయోగం ఉంటుంది. కానీ పాత వాటిలోనూ ఇదే విధంగా వ్యవహరించడం వల్ల ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. అహుడా ఏర్పడిప్పటి నుంచి అధికారులు

(మిగతా 6లో...)

నో ఆప్షన్..!

ఆప్షనల్ హాలిడేపై

వెనక్కు తగ్గని కమిషనర్

పాఠశాలలకు సెలవు లేదు

వ్యక్తిగతంగా మాత్రమే అవకాశం

అయోమయంలో ఉపాధ్యాయులు



అనంతపురం విద్య, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు ఆప్షనల్ హాలిడే విషయంలో విద్యాశాఖ కమిషనర్ వెనక్కు తగ్గలేదు. పాఠశాలలకు ప్రతి విద్యా సంవత్సరం ఐదు ఆప్షనల్ హాలిడేస్ ఉంటాయి. వీటిని పండుగల సమయంలో అవసరమైనపుడు టీచర్లు ఉపయోగించుకునేవారు. ఆరోజు మొత్తం పాఠశాలలకు సెలవు ఇచ్చుకునేవారు. ఇపుడు విద్యాశాఖ కమిషనర్ ఆప్షనల్ హాలిడేస్‌పై కొత్త మెలిక పెట్టారు. ఎట్టి పరిస్థితులలోను స్కూళ్లు బంద్ కాకూడదని, అవసరమైతే పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లలో 50 శాతం మంది వ్యక్తిగతంగా ఆప్షనల్‌హాలిడే పెట్టుకొని వెళ్లొచ్చని ఆంక్షలు పెట్టారు. శనివారం చాలా చోట్ల పీర్ల మెరవణి ఉంటుంది. విద్యార్థులు బడులకు రారు. ఈ నేపథ్యంలో ప్రతిఏటా ఈరోజు పాఠశాలలకు ఆప్షనల్ హాలిడే వదులుకునేవారు. ఈసారి కమిషనర్ విజయరామరాజు.. ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా మాత్రమే ఆప్షనల్ హాలిడే వాడుకోవచ్చని

(మిగతా 7లో...)

కృష్ణానదిలో జిల్లా విద్యార్థి మృతి

7

వైభవంగా కుళ్లాయిస్వామి చిన్నసరిగెత్తు

నార్పల, జూలై 4(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం చిన్నసరిగెత్తు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని కుళ్లాయిస్వామికి చక్కెర చదివింపులు చేశారు. పక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు, జలధి కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శోభ, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఏంటి బాస్ ఇది..?



డీపీఓలోకి అనుమతించకపోవడంతో టెలిఫోన్ భవన్ వద్ద పడిగాపులు

మహిళా పోలీసుల గోడు వినే తీరకలేదా..?

- న్యాయం కోసం డీపీఓకు బాధితులు
- అడ్డుకున్న పోలీసులు.. నిరాశగా వెనుదిరిగిన ఎంఎస్‌కేలు

అనంతపురం క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): బదిలీల బాధితులపై ఉన్నతాధికారులు బాసిజం చూపారు. తమకు అన్యాయం చేశారని, తమ సమస్యలు వినాలంటూ డీపీఓ(జిల్లా పోలీస్ కార్యాలయం)కు వచ్చిన గ్రామ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులను(ఎంఎస్‌కే) కనీసం గేటు కూడా దాటనివ్వలేదు. డీపీఓలోకి రాకూడదంటూ గేటు వద్దే పోలీసులు అడ్డుకున్నారు. పోలీస్ బాస్‌కు ఉద్యోగినుల సమస్యలు వినే తీరిక కూడా లేదా అంటూ బాధితులు ఆక్రోశంతో అక్కడి నుంచి వెనుతిరిగారు. శుక్రవారం సుమారు 20 మంది ఎంఎస్‌కేలు తమ సమస్యలను విన్నవించుకోడానికి డీపీఓ వద్దకు వెళ్లారు. వారిని గేటు వద్ద ఉన్న పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. మహిళా సంరక్షణ (మిగతా 6లో...)



కింద పడిపోయిన బాధితురాలు

మాస్టారూ..! ఇక్కడే ఉండండి

- బదిలీపై వెళ్తున్న టీచర్‌కు విద్యార్థుల కన్నీటి వినతి

తన బోధన, ప్రవర్తనతో పసి మనసులపై ఆ ఉపాధ్యాయుడు చెరగని ముద్ర వేశాడు. పని చేసిన కొద్ది కాలంలోనే వారికి ఎంతో ఆత్మీయుడయ్యాడు. ఇంతలోనే ఆయన్ను వేరే పాఠశాలకు బదిలీ చేశారు. దీంతో విద్యార్థులంతా తమ మాస్టారును వీడలేక బోరుమన్నారు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల(మెయిన్ స్కూల్)లో జరిగింది. ఇక్కడ ఎంటీఎస్ టీచర్‌గా పని చేస్తున్న ఎస్.హనుమంతరాయుడు జెక్కిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో ఆయనకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం సన్మానం చేశారు. అనంతరం ఆ ఉపాధ్యాయుడి వద్దకు విద్యార్థులు వెళ్లి, 'సార్.! మీరు ఎక్కడికి వెళ్లకండి. ఇక్కడే ఉండండి సార్' అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో ఆ మాస్టారు కూడా భావోద్వేగానికి లోనయ్యాడు. బాగా చదువుకోవాలని, కొన్ని రోజుల్లో మళ్లీ ఇక్కడికే వస్తానని చెప్పి, విద్యార్థులను సముదాయించి అక్కడి నుంచి కదిలారు.

- కంబదూరు, ఆంధ్రజ్యోతి



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడి వద్ద ఏడుస్తున్న విద్యార్థులు

అల్లూరి జీవితం ఆదర్శప్రాయం

- కొనియాడిన వక్తలు
- ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

అనంతపురం కలెక్టరేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అల్లూరి జీవితం ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం గిరిజన సంక్షేమ, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ్ శర్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరుడు సీతారామరాజు అన్నారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ అల్లూరి జీవితం మనందరికీ గర్వకారణమని, ఆయన సేవలను చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నేటి యువత అల్లూరి దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జేసీ మాట్లాడుతూ గిరిజన ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి బ్రిటీష్ వారితో పోరాడి ప్రజలకు న్యాయం చేసిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు, పర్యాటక శాఖ అధికారి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

యస్.. నేను పిచ్చోడినే

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'యస్..నేను పిచ్చోడినే. నాకు తాడిపత్రి అంటే పిచ్చి. అందుకే ఎవరు ఏమి అన్నా నేను పట్టించుకోను' అని తాడిపత్రి మున్సిపాలిటీ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను ఈ స్థాయికి తెచ్చిన తాడిపత్రి ప్రజలకు ఏమైనా చేయాలనే తపనే తనను పిచ్చివానిగా మారుస్తోందంటూ భావోద్వేగం చెందారు. తాడిపత్రిని అభివృద్ధి చేయాలన్నదే తన తాపత్రయం అన్నారు. సీబీరోడ్డు, యల్లనూరు రోడ్డు వెడల్పు చేశామని, పుట్లూరు రోడ్డు కూడా చేస్తే వ్యాపారాలు బాగుపడతాయనే ఉద్దేశంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ రోడ్డును కూడా చేస్తామన్నారు. శ్మశానం రూపురేఖలు కూడా మార్చినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ఎస్పీ పర్మిషన్ ఇచ్చి తాడిపత్రికి పంపించినా ఇక్కడి ప్రజలు ఆయన్ను రానివ్వరన్నారు. ఆయన చేసిన అరాచకాలు అన్ని ఇన్నీ కావు అందువల్ల తాడిపత్రి ప్రజలకు ఆయనంటే ఇష్టం లేదు అని పేర్కొన్నారు.



చేరేవారే లేరా..?

- 57 ప్రభుత్వ బడుల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్
- రాష్ట్ర యంత్రాంగం అవాక్కు.. పరిశీలనకు స్టేట్ టీమ్
- విద్యార్థుల నమోదు, టీచర్ల హాజరుపై నివేదికలు

7

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు



లైంగిక శక్తిని పెంచుతాం..!

- అసత్య ప్రకటనలతో బురిడీ.. విజిలెన్స్ దాడుల్లో గుట్టు రట్టు

అనంతపురం క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'మీ లైంగిక శక్తి పెంచుతాం. షుగర్ వ్యాధిని నియంత్రిస్తాం' అని అసత్య ప్రకటనలతో మోసగిస్తున్న ఓ ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థపై విజిలెన్స్, ఆయుర్వేద వైద్య శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. విజిలెన్స్ సీఐ శ్రీనివాస్, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ మాధవి, డాక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ రఫీ బృందం నారాయణపురం పంచాయతీలోని రాఘవేంద్ర కాలనీలో దాడులు చేసింది. డోర్ నంబర్ 35-132-4లో ఎస్-3 గ్రూప్స్ పేరుతో నడుపుతున్న సంస్థలో ఎక్స్ పవర్ సిరప్, సీహెచ్‌ఆర్ డైయా కంట్రోల్ సిరప్, ఎస్3 గ్రూప్ ఆయుర్వేద సిరప్స్‌పై అసత్య ప్రకటనలు ఇస్తున్నట్లు గుర్తించారు. ప్రజలకు ఫోన్లు చేసి ఆర్డర్లు తీసుకుంటూ, నెల్లూరుకు చెందిన భరత్ అనే వ్యక్తికి డెలివరీ కోసం పంపుతున్నట్లు అధికారులు తేల్చారు. దాడులు చేసిన సమయంలో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషుల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటున్నట్లు గుర్తించారు. కొనుగోలు దారుల పేర్లు, కాంటాక్టు నంబర్లు, వాట్సప్ చాట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టం 1954 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



దాడులు చేసిన అధికారులు

డిగ్రీ ప్రవేశాలు ఎప్పుడు..?

- రెండు నెలలుగా విద్యార్థుల నిరీక్షణ
- నోటిఫికేషన్ ఇవ్వని ఉన్నత విద్యాశాఖ
- ఆన్‌లైనా..? ఆఫ్‌లైనా..? స్పష్టత కరువు
- జాప్యం జరిగితే ప్రభుత్వ కాలేజీలకు నష్టం



కదిరి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలువడి రెండు నెలలు గడిచినా డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ కాలేదు. అడ్మిషన్లు ఎప్పుడు పారంభిస్తారో తెలియక విద్యార్థులు కళాశాలల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరికకు కౌన్సెలింగ్ మొదలైతే, ఆ ప్రభావం సాధారణ డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్న కళాశాలలపై పడుతుందని యాజమాన్యాలు, అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ డబుల్ మేజర్ సబ్జెక్టు..?

డిగ్రీలో గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని డబుల్ మేజర్ సబ్జెక్టుకి మార్చాలని ఉన్నత విద్యా శాఖ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిసింది. అయితే దీనిపై తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. డిగ్రీ ప్రవేశాలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో దేనిని అనుసరించాలనే అంశంపైనా ఉన్నత విద్యా శాఖ అధికారులు ఇంకా నిర్ణయానికి రాలేదు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షల్లో ఆశించిన ర్యాంకు రాని విద్యార్థులు సాధారణ డిగ్రీ కోర్సుల్లో చేరడానికి మొగ్గు చూపుతుంటారు. జూలై మొదటి, రెండో వారంలో డిగ్రీ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల కాకపోతే, విద్యార్థుల్లో పలువురు ఇంజనీరింగ్ లేదా ఫార్మా కోర్సుల్లో చేరే అవకాశాలు ఉంటాయని అధ్యాపకులు అంటున్నారు. ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తే కళాశాలల్లో ఎక్కువ సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు.

అస్తవ్యస్తం ఆన్‌లైన్ విధానం

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు 92 ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి గతం నుంచి అమలులో ఉన్న విధానాన్ని వైసీపీ ప్రభుత్వం మార్చింది. 2020-21 విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఫలితంగా ప్రవేశాల్లో తీవ్ర గందరగోళం ఏర్పడుతోంది. జూన్ నెలాఖరుకు పూర్తయ్యే అడ్మిషన్లు ఆగస్టు, సెప్టెంబరుకు గానీ పూర్తి కావడం లేదు. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్‌లైన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాల కారణంగా విద్యార్థులు కొంత ఒత్తిడికి లోనవుతున్నారు. విద్యార్థికి దగ్గరలో, ఇష్టమైన కళాశాల ఎంపిక కష్టంగా మారుతోంది. ఆన్‌లైన్ ప్రవేశాల మొదలైనప్పటి నుంచి సీట్ల కేటాయింపు వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టే వరకు విద్యార్థులకు టెన్షన్ తప్పడం లేదు. తీరా చూస్తే చదవాలనుకునే కోర్సు దక్కడం

(మిగతా 7లో..)

చదువుకొమ్మని పంపితే..!

అనంతపురం క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూతురు చదువుకు తల్లిదండ్రులు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. బంగారు తల్లి బాగా చదువుకోవాలని, జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆశిస్తున్నారు. నగరానికి చెందిన ఓ యువతిని కూడా తల్లిదండ్రులు అలాగే చదివించాలని భావించారు. ఉన్నత విద్య కోసం బెంగళూరుకు పంపించారు. కొన్నాళ్ల క్రితం ఆ యువతి అదృశ్యమైంది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఆమె ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. శ్రీనివాస్ నగర్‌కు చెందిన ఆ యువతి మేజర్ కావడం, ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నానని చెప్పడంతో పోలీసులు తహసీల్దారు ఎదుట హాజరుపరిచారు. తల్లిదండ్రుల సమక్షంలో ఆమెను భర్తకు అప్పగించారు.

మహిళల సమస్యలపై ఐక్య ఉద్యమాలు

● ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

అనంతపురం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మహిళ సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేపడతామని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఐద్వా నగర 8వ మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత ఐద్వా వ్యవస్థాపకుల్లో ఒకరైన మానికొండ సూర్యవతి వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో సావిత్రి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై హింస పెరిగిపోతోందన్నారు. రాష్ట్రంలో వరుసగా అమానుష ఘటనలు జరుగుతుండటం ఆవేదన కలిగిస్తోందన్నారు. పాలకులు సంఘటనలు జరిగినప్పుడు హడావుడిగా బాధితుల పక్షాన మాట్లాడి, ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారని విమర్శించారు. మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మహాసభల సందర్భంగా మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా సభలో ఆమోదించారు.

ఐద్వా నగర కమిటీ ఎన్నిక

ఐద్వా నగర మహాసభల్లో భాగంగా నగర కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా నగర కమిటీ నూతన అధ్యక్షురాలుగా శంషాద్, ప్రధాన కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా గీత, ఆఫీస్ బేరర్లుగా పద్మ, శైలజ, లక్ష్మి, పర్యాబి, తులసితోపాటు ఆఫీస్ బేరర్లు మొత్తం 26 మందితో నగర కమిటీని ఎన్నుకున్నారు.

అర్ధరాత్రి ఆస్పత్రిలో..

అయినవారి ప్రాణం నిలుపుకోవడం కోసం పేదలు ఆత్రంగా అనంతపురం పెద్దాస్పత్రికి వస్తున్నారు. అర్ధరాత్రి కూడా క్యూ కడుతున్నారు. వార్డుల్లో బెడ్లు ఖాళీగా ఉండటం లేదు. దీంతో ఆసుపత్రి ఆవరణం రోగులు, వారి సహాయకులతో నిండిపోతోంది. పగలు ఎలాగోలా గడిపినా.. రాత్రి అయితే నిద్రకు ఇబ్బంది పడుతున్నారు. ఖాళీ దొరికిన చోట కునుకు తీస్తున్నారు. దోమలు, చలిగాలి, చినుకులతో అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణం. గురువారం అర్ధరాత్రి తీసిన ఫొటోలు ఇవి..

- ఆంధ్రజ్యోతి, అనంతపురం వైద్యం



మనవారి బండి..
మనం తోయాల్సిందేనండీ..!



చోటు దొరికితే చాలు.. సిమెంటు దిమ్మెలే పూల పాన్పులు..



అలసి సొలసి కొందరు.. చింత చేస్తూ మరికొందరు..

ఇప్పుడెలా..?

(5వ పేజీ తరువాయి)

నిబంధనలు ఖచ్చితంగా అమలు చేసుంటే ఈ పరిస్థితి ఉండేది కాదంటున్నారు. ఇప్పటికే పాత లేవుట్లలో క్రయ విక్రయాలు జరిగిపోయాయి. పాత లేఅవుట్లలో కొందరూ నిబంధనలు పాటించగా, మరికొందరు పాటించలేదు. నిబంధనల ప్రకారం ఉన్న లేఅవుట్లు పదుల సంఖ్యలో ఉంటే, నిబంధనలు ప్రకారం లేనివి వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో కూడా పంచాయితీ అధికారులు నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ చలాన కట్టించుకుని బిల్డింగ్ అప్రూవల్స్‌కు అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు అహుడా అధికారులు చేపట్టిన చర్యలతో వాటిలో కూడా అనుమతులు ఇచ్చేందుకు వీలు లేకుండా పోయింది.

పంచాయతీ ఆదాయానికి గండి..

బిల్డింగ్ అప్రూవల్స్ నిలుపుదలతో పంచాయతీల ఆదాయానికి పెద్ద మొత్తంలో గండిపడుతోంది. అనంతపురం రూరల్ మండల పరిధిలోని పంచాయతీల్లో నెలకు కనీసం ఐదారు అప్రూవల్స్ జరుగుతున్నాయి. దీంతో స్థలం విలువలో యజమానుల నుంచి పంచాయతీకి 14శాతం పన్ను రూపంలో ఆదాయం సమకూరుతోంది. ఒక్కో అప్రూవల్‌కు కనీసం రూ.లక్షకుపైగానే ఆదాయం వస్తోంది. దీంతోనే పంచాయతీల్లో చిన్నచిన్న మరమ్మతులు చేయించడం, వీధి లైట్లు ఏర్పాటు చేయడం, కార్మికుల వేతనాలు చెల్లింపులు ఇతరత్ర జరిగేది. అయితే అహుడా అధికారులు బిల్డింగ్ అప్రూవల్ సైట్ నిలిపివేయడంతో మూడు నెలలుగా పంచాయతీలకు వచ్చే ఆదాయం పూర్తిగా పడిపోయింది.

అనుమతులంటే హడల్

అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో నాలుగు సెంట్లలో ఇల్లు కట్టాలంటే అనుమతులకే లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి అహుడా నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలంటే నాలుగు సెంట్లకు అనంతపురం రూరల్ మండల పరిసర ప్రాంతాల్లో కనీసం రూ.నాలుగైదు లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. పంచాయతీకి 14శాతం టాక్స్ చెల్లించడంతోపాటు లేబర్ సెస్సు, అహుడా అనుమతుల ఫీజు ఇలా తడిసిమోపెడవుతున్నట్లు గృహనిర్మాణదారులు వాపోతున్నారు. ఇంత మొత్తం చెల్లించే బదులు..అనుమతులకు వెళ్లడమే మానేస్తే మేలుకదా అంటున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు తప్ప ఒరిగింది ఏమీలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మాన్యువల్ అనుమతులకు దారి..

అహుడా అధికారుల తీరుతో కొన్ని పంచాయతీల్లో మాన్యువల్ అనుమతులు ఇస్తున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియతో గతంలో గృహనిర్మాణదారులు ఇబ్బందులు పడినట్లు సమాచారం. అనుమతులకు సంబంధించిన వివరాలు సంబంధిత పంచాయతీ రికార్డుల్లో లేకపోవ డం వంటి సమస్యలు తలెత్తాయి. అందుకే బిల్డింగ్ అప్రూవల్స్ ఆన్‌లైన్ చలానా తప్పనిసరి చేశారు. దీంతో ఆదాయం నేరుగా పంచాయతీ ఖజానాలోకి వచ్చి చేరుతోంది. అయితే ప్రస్తుతం అహుడా అధికారులు చేపట్టిన చర్యలతో పరిస్థితి గతంలో మాదిరిగానే మారుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణాదారులకు పంచాయతీ అనుమతులుంటే బ్యాంకులు రుణాలు ఇస్తాయి. దీంతో కొందరు పంచాయతీ అధికారులు అందినకాడికి దండుకుని బిల్డింగ్ అనుమతులు మాన్యువల్‌గా చేస్తున్నట్లు తెలిసింది. దీంతో భవిష్యత్తులో ఇంటి యజమానులకు అనేక సమస్యలు తలెత్తుతాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో ఇలా అనుమతులు పొందిన వారు ఇప్పుడు అవస్థలు పడుతున్నట్లు సమాచారం.



చిన్నంపల్లి గ్రామ సమీపంలో వేసిన లే అవుట్

నింబంధనల ప్రకారమే...



ఏప్రిల్ నుంచి పంచాయతీల్లో బిల్డింగ్ అప్రూవల్స్ నిలిపివేసిన విషయం వాస్తవమే. అహుడా అధికారులు అక్రమ లేఅవుట్ల నియంత్రణకు ఈ చర్యలు తీసుకున్నారు. అయితే ఎల్‌పి నెంబరు, టౌన్‌ప్లానింగ్, అహుడా నిబంధనల ప్రకారం ఉన్న లేఅవుట్లలో బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నాం. ప్రస్తుతం అక్రమ లేఅవుట్లలో ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. ఎవరైనా ఇచ్చినా వారిపై చర్యలు తప్పవు.

- వెంకటనాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ, అనంతపురం రూరల్ మండలం

ఏంటి బాస్ ఇది..?

(5వ పేజీ తరువాయి)

కార్యదర్శులు కొన్ని రోజులు ఎవరూ ఇటువైపు రాకూడదని, వచ్చినా అనుమతించకండి అంటూ ఉన్నతాధికారుల ఆదేశించారని అడ్డుకున్నారు. దీంతో మహిళా పోలీసులు ఏం చేయాలో తెలియక అక్కడే ఉన్న వేమన టెలిఫోన్ భవన్ వద్ద పడిగాపులు కాశారు. తమ శాఖా ఉన్నతాధికారులే తమకు లోపలికి అనుమతించ కుంటే, తమ గోడు వినేదెవరు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



సపర్యలు చేస్తున్న తోటి బాధిత మహిళా సంరక్షణ కార్యదర్శులు

కళ్లు తిరిగి కిందపడిన బాధితురాలు

డీపీఓ వద్దకు వచ్చిన ఓ మహిళా పోలీస్ కళ్లు తిరిగి కింద పడిపోయారు. గత రెండు, మూడు రోజులుగా కౌన్సెలింగ్ కారణంగా నిద్ర లేకపోవడం, తీవ్ర ఒత్తిడికి గురికావడంతో అస్వస్థతతో కిందపడిపోయారు. అక్కడే ఉన్న పలువులు మహిళా సంరక్షణ కార్యదర్శులు ఆమెకు సపర్యలు చేసి, ఉపశమనం కలిగించారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారులు తీరుపై బాధిత ఉద్యోగులు, సామాన్యులు సైతం ఇదెక్కడి బాసిజం అంటూ మండిపడ్డారు. వందలాది మంది మహిళా పోలీసులకు నాలుగు రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించి, గందరగోళం సృష్టించిన అధికారులు కనీసం వాళ్ల సమస్యలు వినేందుకు కూడా అనుమతించకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడి పరిస్థితులను ఫొటోలు తీయడానికి వెళ్లిన మీడియా ఫొటో గ్రాఫర్లను సైతం అనుమతించలేదు. డీపీఓ ఫొటోలు తీసుకోవాలన్నా అనుమతులు తీసుకోవాలంటూ పోలీసులు హెచ్చరించడం బాసిజానికి పరాకాష్టగా నిలుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు కప్పిపుచ్చుకోవడానికే...

బాధితులను డీపీఓలోకి అనుమతించకపోవడం వెనుక జిల్లా పోలీస్ బాస్, ఇతర అధికారులు అభద్రతా భావం కొట్టిచ్చినట్లు కనిపిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీలు అన్నీ సకాలంలో పూర్తిచేశారు. కానీ మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలను పైరవీలు, అవకతకవల నడుమ గందరగోళంగా చేశారు. ఇది మీడియాలో ప్రచురితం కావడం, వీడియోలు వైరల్ కావడంతో ఎక్కడ పరువు పోతుందోననన భయంతో బాధితులను ఎవరినీ అనుమతించలేదు. పైగా ఒకే ప్లేస్‌ను ఇద్దరు, ముగ్గురికి ఇచ్చిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఇలాంటి అవకతవకల నేపథ్యంతోనే బాసిజం పేరుతో బెదిరింపులకు దిగారని బాధితులు వాపోతున్నారు.


చీనీ టన్ను రూ.22వేలు



అనంతపురం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు (గ్రెరంగాలు) టన్ను గరిష్ఠంగా రూ.22వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలకు విక్రయాలు జరిగాయన్నారు. ఇక సీజనల్ రకం కాయలు టన్ను గరిష్ఠంగా 16వేలు, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 773 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు


అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫొటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

నో ఆప్షన్..!

(5వ పేజీ తరువాయి)

చెప్పడం సమస్యగా మారింది. జిల్లా, రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ రాష్ట్ర అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం కలగలేదు. ఆప్షనల్ హాలిడే టీచర్లు వ్యక్తిగతంగానే ఉపయోగించుకోవాలని శుక్రవారం ఆర్జేడీ శామ్యూల్ జిల్లా విద్యాశాఖకు ఆదేశిలిచ్చారు. ఈ విషయాన్ని డీఈఓ ప్రసాద్‌బాబు ధృవీకరిస్తూ.. పాఠశాలలు మూత పడడానికి వీలులేదని పేర్కొన్నారు. పాఠశాలలను కొనసాగించాలని, అవసరం ఉన్న టీచర్లు మాత్రమే ఆప్షనల్ హాలిడే పెట్టుకోవచ్చని, ఒక పాఠశాలలో 50 శాతం మించి పెట్టుకోవడానికి లేదని డీఈఓ స్పష్టం చేశారు. దీంతో టీచర్లు అయోమయంలో పడిపోయారు.

కృష్ణానదిలో జిల్లా విద్యార్థి మృతి


అభిరామ్(ఫైల్)

విజయవాడ (వన్‌టౌన్)/ధర్మవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సర్టిఫికెట్లు తెచ్చుకోవడానికి వెళ్లిన ధర్మవరం మండలం ఓబులనాయనపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి గడ్డం అభిరామ్ (18) శుక్రవారం విజయవాడ వద్ద కృష్ణానదిలో మృతి చెందాడు. విజయవాడ పోలీసులు తెలిపిన మేరకు ఓబులనాయనపల్లి గ్రామానికి చెందిన రైతు చంద్ర మోహన్ కుమారుడు అభిరామ్ గూడవల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ పాసయ్యాడు. కళాశాలలో సర్టిఫికెట్లు తీసుకోవటానికి 12 మంది స్నేహితులతో కలిసి గురువారం సాయంత్రం సొంతూరు నుంచి రైలులో విజయవాడ వెళ్లాడు. శుక్రవారం ఉదయం కృష్ణానదిలో స్నానం చేసి అమ్మవారి గుడికి వెళ్లి, ఆ తరువాత కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్లు తీసుకుందామని స్నేహితులు అనుకున్నారు. ఆ ప్రకారం వారందరూ స్టేషన్ నుంచి నడుచుకుంటూ శనైశ్చర స్వామి ఆలయ సమీపంలోని నదిలో స్నానం చేయటానికి నీటిలో దిగారు. అయితే అభిరామ్ ఈత రాక ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ప్రకాశం బ్యారేజి వద్ద ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం, కృష్ణలంక పోలీసులు నదిలో గాలించి అభిరామ్ మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అభిరామ్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతి వార్త తెలిసిన వెంటనే మంత్రి సత్యకుమార్ అభిరామ్ తల్లిదండ్రులతో మాట్లాడి ఓదార్చారు. మృతదేహాన్ని స్వగ్రామమైన ఓబుళనపల్లికి తీసుకురావడానికి మంత్రి ప్రైవేటు అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు.

ఘర్షణలో టీడీపీ కార్యకర్త మృతి

గోరంట్ల, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తరాయినితండాలో శుక్రవారం సాయంత్రం ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో లోకేష్‌నాయక్ (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ముత్తరాయినితండాకు చెందిన లోకేష్‌నాయక్, అదే తండాలోని వైసీపీ మద్దతుదారుడు తిప్పేనాయక్ కుమారుడు భాస్కర్‌నాయక్ ఇరువురు కూలి పనికెళ్లారు. సాయంత్రం ఇరువురు కలిసి మద్యం సేవిస్తుండగా వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఇరువురు ఇళ్లకు వెళ్లిపోయారు. భాస్కర్‌నాయక్ ఇంటిముందు దుర్భాషలాడుతుండగా, లోకేష్‌నాయక్ అడ్డుకోవడానికి ప్రయత్నించాడు. భాస్కర్‌నాయక్ కట్టెతో దాడి చేసి తలపై కొట్టడంతో లోకేష్‌నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, డీలర్ రాఘవనాయుడు, శ్రీనివాసులు, వెంకటేష్, గోపాల్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏఎస్ఐ షేక్షావలి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని విద్యార్థి ఆత్మహత్య

బుక్కపట్నం, జూలై 4(ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లకుండా, చదువు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కుమారుడిని తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన కుమారుడు హేమంత్ కుమార్(14) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుక్కపట్నం మండలం చిన్నచెరువు తండాలో శుక్రవా రం ఈ సంఘటన జరిగింది. తండాకు చెందిన సంకుబాయి కుమారుడు హేమంత్ కుమార్.. మారాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బడికి వెళ్లకుండా అల్లరిచిల్లరగా తిరుగుతుండడంతో తల్లి మందలించింది. పొలం కోసం తెచ్చిన పురుగు మందును హేమంత్ బుధవారం తాగాడు. కుటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఎస్ఐ క్రిష్ణమూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడు..

పరిగి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లిలో సోమశేఖర్ (29) అనే యువకుడు గురువారం రాత్రి ఉరివేసుకున్నాడు. సోమశేఖర్ డిప్లమో చదివి నాలుగేళ్లపాటు బెంగళూరులోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేశాడు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చి, మేకలను కాస్తుండేవాడు. తనకు ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో చీరతో దూలానికి ఉరివేసుకున్నాడు. తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

గంజాయి కేసులో 17 మందికి జైలు శిక్ష

అనంతపురం క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించిన కేసులో 17 మంది ముద్దాయిలకు జైలు శిక్ష పడింది. వీరిలో 12 మందికి ఐదేళ్లు, ఐదుగురికి ఏడాది శిక్ష విధిస్తూ అనంతపురం మొదటి ఏడీజే కోర్టు న్యాయాధికారి సత్యవాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. గంజాయి విక్రయిస్తున్న 20 మందిపై 2018లో అనంతపురం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అదే ఏడాది సీలు హమీద్ ఖాన్, విజయ భాస్కర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి చార్జిషీటు దాఖలు చేశారు. ముద్దాయిల నుంచి మూడు కిలోల గంజాయి, రూ.40.12 లక్షల నగదు, 32 సెల్‌ఫోన్లు, రెండు లాప్‌టాప్‌లు, ప్రింటర్, 2 కాలిక్యులేటర్లు, హాట్‌స్పాట్ రూటర్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఆరున్నరేళ్ల తర్వాత తీర్పు వచ్చింది.

శిక్ష పడింది వీరికే..

- తాడిపత్రికి చెందిన అబ్దుల్లా (30), మహ్మద్ ఖాసీం(24), జాఫర్ వలీ(37), కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన జలీల్(70), కడపకు చెందిన రామయ్య(67), రామచంద్రారెడ్డి (65), జయచంద్రారెడ్డి (65), సుబ్బరాయుడు(56), గుత్తికి చెందిన నారాయణ (58), ముల్లా జాఫర్ (55), గోపాల్(44), నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన ఇబ్రహీం (63)కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేలు చొప్పున జరిమానా పడింది.
- తాడిపత్రికి చెందిన సాదిక్ వలీ(40), హబీబ్ ఖాన్(27), అబుబాకర్, ప్రసాద్ కుమార్(39), నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన లాల్ బాషా(52)కు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. డోన్‌కు చెందిన షేక్ సిరాజుద్దీన్(59), జమ్మలమడుగుకు చెందిన ఇంద్రశేఖర్ (48), గుత్తికి చెందిన విజయకుమార్(48) విచారణ దశలో మృతిచెందారు.

వజ్రకరూరు సర్పంచ్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ మోనాలిసా

ఉరవకొండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): తన ప్రతిభతో వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ పర్ఫార్మర్ అవార్డు గెలుచుకున్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ సంస్థ ఢిల్లీలో గత నెల 28 నుంచి షి రెప్రజెంటేటివ్-25 అనే పేరుతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి దేశంలో 45 మంది మహిళలను ఎంపిక చేసింది. ఇందులో పాల్గొన్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా బాల్యవివాహాలను ఏవిధంగా అరికట్టవచ్చు, మహిళా సంఘాలను ఎలా బలోపేతం చేయవచ్చు అన్న అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చి బెస్ట్ ఫర్ఫామెంట్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఢిల్లీలో ఆమెకు శుక్రవారం ఆ అవార్డు అందజేశారు.

జనాభా విద్యపై పోటీలు

బుక్కపట్నం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, కేజీబీవీ విద్యార్థులకు ఈనెల 7న వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. జనాభా విద్యపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకు, మత్తు పదార్థాలు, పొగాకుతో అనర్థాలు, లింగ సమానత్వం, గౌరవం విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలను పాఠశాలలలో నిర్వహించుకోవాలని, మొదటి రెండు స్థానాలలో నిలిచినవారికి ఈ నెల 9న బుక్కపట్నంలోని ప్రభుత్వం డైట్ కళాశాలలతో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామని, వివరాలకు 9441615958 నంబరులో సంప్రదించాలన్నారు.

చేరేవారే లేరా..?

57 ప్రభుత్వ బడుల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్

ఒకటిలో 38, ఆరో తరగతిలో 19 పాఠశాలల్లో నిల్

రాష్ట్ర యంత్రాంగం అవాక్కు.. పరిశీలనకు స్టేట్ టీమ్

విద్యార్థుల నమోదు, టీచర్ల హాజరుపై నివేదికలు


అనంతపురం ఎంఆర్‌సీలో విద్యార్థుల నమోదు, టీచర్లు, విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

అనంతపురం విద్య, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో పట్టుదలతో కృషిచేస్తున్నాయి. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇంట్లో ఎంతమంది చదువుతున్నా.. అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నారు. ఆ మేరకు ఒక్కో విద్యార్థికి రూ.13వేల చొప్పున తల్లుల ఖాతాల్లోకి జమచేశారు. ఉచితంగా పుస్తకాలు, బూట్లు, యూనిఫామ్, బ్యాగులు అందించారు. ఇంత చేస్తున్నా ప్రభుత్వ బడులలో పిల్లలు చేరకపోవడంపై ప్రభుత్వ పెద్దలకు అంతు చిక్కడం లేదు. అనంత జిల్లాలో మొత్తం మీద 57 పాఠశాలల్లో విద్యా సంవత్సరం ఒకటి, ఆరో తరగతులలో ఒక్క విద్యార్థి చేరకపోవడంపై రాష్ట్ర విద్యాశాఖాధికారులు అవాక్కువుతున్నారు. వాస్తవ సమాచారం తెలుసుకోవడానికి కమిషనర్ విజయరామరాజు రాష్ట్రం నుంచి ప్రత్యేక టీమ్‌ను జిల్లాకు పంపారు. ఆ టీమ్ సభ్యులు శుక్రవారం అనంత జిల్లాకు చేరుకున్నారు. సున్నా నమోదు, టీచర్లు, విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్న స్కూళ్లను పరిశీలించి నివేదికలు తయారుచేసి కమిషనర్‌కు ఇవ్వనున్నారు.

38 ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కరూ చేరలేదు

జిల్లాలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. అపుడే 20 రోజులు గడిచింది. దాదాపు 10 రోజులుగా ఎన్‌రోల్‌మెంట్ కోసమే విద్యాశాఖ, ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. 38 ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అధికారుల రికార్డుల మేరకు.. ఎస్‌వీ కాలనీ (బుక్కరాయసముద్రం), ఎంపీపీఎస్ ఉర్దూ, ఎంపీపీఎస్ ఎస్ఆర్ కోట (డీ.హీరేహాల్), సంజీవపురం బీసీ కాలనీ, జంబులదిన్నె (గార్లదిన్నె), ఈశ్వరపల్లి (గుత్తి), ఏఆర్ఏఎంఎంపీఎల్ 32వార్డు (గుంతకల్లు), కదరంపల్లి, ఓబుళాపురం (కళ్యాణదుర్గం), పి.చెర్లోపల్లి (కంబదూరు), బొమ్మకుంటపల్లి, బొందలవాడ, జంగారెడ్డిపల్లి, ఎంపీపీఎస్ ఉర్దూ (నార్పల) అక్కమాజంపల్లి, సొరకాయలపేట, ఉర్దూపామిడి (పామిడి), చిన్నపప్పూరు, ధర్మాపురం, గార్లదిన్నె, పి.కొట్టాలపల్లి, పెండేకల్లు (పెద్దపప్పూరు), ఎ.కొండాపురం, కొండేపల్లి, నారాయణరెడ్డిపల్లి, రంగరాజుకుంట, వెంగన్నపల్లి (పుట్లూరు), గంగులకుంట (రాప్తాడు), ఏకులనాగేపల్లి, గోవిందరాయునిపల్లి (శింగనమల), బందార్లపల్లి, చల్లావారిపల్లి, పులిప్రొద్దుటూరు (తాడిపత్రి), కమలపాడుతండా (వజ్రకరూరు), జనార్దనపల్లి (విడపనకల్లు), సీఎస్ఐఈఎల్ఈ స్కూల్, వైతిప్పారెడ్డిపల్లి (యాడికి) ఈ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు.

19 ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతికి జీరో

జిల్లాలోని పలు హైస్కూళ్లలో ఈసారి ఆరో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా ఎన్‌రోల్ కాకపోవడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇందులో ముట్టాల జడ్పీహెచ్ఎస్, తలుపూరు జడ్పీహెచ్ఎస్ (ఆత్మకూరు), జడ్పీహెచ్ఎస్ వెంకటాద్రిపల్లి(బెలుగుప్ప), జడ్పీహెచ్ఎస్ గుత్తిఆర్ఎస్ (గుత్తి), జడ్పీహెచ్ఎస్ ఎన్.నరసాపురం (గుంతకల్లు), జడ్పీహెచ్ఎస్ పాపంపల్లి (కళ్యాణదుర్గం), జడ్పీహెచ్ఎస్ పాలూరు, జడ్పీహెచ్ఎస్ ఉర్దూహైస్కూల్ (కంబదూరు), జడ్పీహెచ్ఎస్ గాండ్లపర్తి, జడ్పీహెచ్ఎస్ గొందిరెడ్డిపల్లి, జడ్పీహెచ్ఎస్ ఎం.బండమీదపల్లి, జడ్పీహెచ్ఎస్ మరూరు (రాప్తాడు), జడ్పీహెచ్ఎస్ లక్ష్మంపల్లి, జడ్పీహెచ్ఎస్ ములకలేడు (శెట్టూరు), జడ్పీహెచ్ఎస్ సి.బండమీదపల్లి (శింగనమల), జడ్పీహెచ్ఎస్ బ్రాహ్మణపల్లి, జడ్పీహెచ్ఎస్ తేరన్నపల్లి (తాడిపత్రి), జడ్పీహెచ్ఎస్ కూచివారిపల్లి, జడ్పీహెచ్ఎస్ వెన్నపూసపల్లి(యల్లనూరు) జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని విద్యాశాఖ చెబుతోంది. ఈ పాఠశాలలన్నింటిని స్టేట్‌కమిటీ బృందం మల్లికార్జునరావు నేతృత్వంలో పరిశీలిస్తోంది. ఇక్కడ ఇలా ఎందుకు జరిగిందో నివేదికల రూపంలో కమిషనర్‌కు కమిటీ అందజేయనుంది.

ఎంఈఓల మెడపై హాజరు కత్తి..!

(5వ పేజీ తరువాయి)

కేంద్రంలోనే నివాసాలు ఉండడంతో సమయపాలన పాటించకుండా ఉండేవారు. ఎపుడో వెళ్లి హాజరు వేసుకునేవారు. కొందరైతే జిల్లా కేంద్రంలోనే ఉంటూ ఇక్కడి నుంచే ఏదో ఒక పని బూచి చూపి ముఖహాజరు నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎంఈఓలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు ఆధారాలతో కమిషనర్‌కు వెళ్లాయి. ఈ నేపథ్యంలోనే కొత్త ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే ఎంఆర్‌సీలలో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఆపరేటర్లు, ఇతర కిందిస్థాయి సిబ్బంది కూడా ఉదయం 9 గంటలకే ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.

హాజరు, తనిఖీలపై రోజూ నివేదిక

కథలు చెప్పి తప్పించుకోవడానికి అవకాశం లేకుండా ఎంఈఓల మెడకు కమిషనర్ కత్తి బిగించారు. టీచర్ల మాదిరిగానే ఉదయం 9-30 గంటలకు ఎంతమంది ఎంఈఓలు హాజరు వేశారో జిల్లా విద్యాశాఖ ప్రతిరోజూ కమిషనరేట్‌కు నివేదిక పంపుతుంది. ప్రతి రోజూ ఒక పాఠశాలను ఎంఈఓ తప్పనిసరిగా తనిఖీ చేయాలి. గతంలో కొందరు ఎంఈఓలు జిల్లా కేంద్రం నుంచి ఎప్పుడో బయలుదేరి.. దగ్గర ఉన్న పాఠశాలలకు వెళ్లి తూతూమంత్రంగా తనిఖీలు చేసి హాజరయినట్లు నమోదు చేసుకునేవారు. ఇపుడు అలా కాకుండా ఎంఈఓలకు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నారు. ఎంఆర్‌సీకి వెళితే అక్కడ లోకేషన్ చూపిస్తుంది. పాఠశాలలకు వెళితే ఆయా పాఠశాలల లోకేషన్ చూపిస్తుంది. అపుడు ఎంఈఓలు ఎక్కడ ఉన్నారో స్పష్టంగా తెలిసిపోతుంది. ఈ కొత్త నిబంధనలు ఎంఈఓలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఎంఈఓలు ముఖ హాజరు వేయాల్సిందే

ఎంఈఓలు కూడా ఇప్పటి నుంచి ప్రతిరోజూ ఉదయం 9 గంటలకే ఎంఆర్‌సీలకు వెళ్లి ముఖ హాజరు వేయాల్సిందే. అలాగే రోజూ ఒక పాఠశాలను తప్పనిసరిగా తనిఖీ చేయాల్సి ఉంటుంది. హాజరుపై రోజూ 9-30 గంటలకు కమిషనరేట్‌కు సమాచారం ఇస్తాం. పాఠశాలలకు వెళ్లినపుడు జీపీఎస్ విధానంలో అక్కడి లోకేషన్ నుంచే హాజరు వేయాల్సి ఉంటుంది. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. కమిషనర్ ఆదేశాలను ప్రతి ఎంఈఓ విధిగా పాటించాల్సిందే.

- ప్రసాద్‌బాబు, డీఈఓ

డిగ్రీ ప్రవేశాలు ఎప్పుడు..?

(5వ పేజీ తరువాయి)

లేదు. దూరంగా ఉన్న కళాశాలలో సీటు వస్తోంది. ఆన్‌లైన్‌లో కళాశాలల ఎంపికలో తడబాటుకు లోనవుతున్నారు.

ప్రైవేటుకు లాభం..

అడ్మిషన్ల ప్రక్రియ ప్రకటనలో జరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కళాశాలలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చిన వెంటనే తమ కళాశాలల్లో వారిని అనధికారికంగా చేర్చుకుంటున్నారు. మార్కుల జాబితాలు, టీసీలు, ఇతర సర్టిఫికెట్లను తీసుకుంటున్నారు. ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరిన వారిచేత దరఖాస్తు చేయించి, తమ కళాశాలలను ఆప్షన్లగా ఎంచుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. దీని వల్ల ప్రైవేటు కళాశాలలకు అధిక ప్రయోజనం కలుగుతోంది. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు భర్తీ కావడం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రవేశాల షెడ్యూల్ ప్రకటించాలని, సింగిల్ లేదా డబుల్ మేజర్ సబ్జెక్టులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

నెలకు పైగా సాగే ప్రక్రియ

ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నెలకు పైగా సాగుతుంది. గతంలో రెండు నెలల సమయం తీసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంకా ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేయలేదు. ఆన్‌లైన్ పద్ధతినే ఎంచుకుంటే.. రిజిస్ట్రేషన్, కళాశాలలు, కోర్సులకు వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు.. చివరగా ప్రవేశాలు ఉంటాయి. తొలి విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మరో రెండు విడతల ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుంది. ఇదంతా పూర్తై.. తరగతులు ప్రారంభమయ్యే సరికి ఆగస్టు వస్తుంది. దీనివల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుంది. ఆఫ్‌లైన్‌లో అయితే మొత్తం ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి తరగతులు ప్రారంభించే వీలుంటుంది.

డిగ్రీపై పెరిగిన ఆసక్తి

నాలుగేళ్లగా డిగ్రీపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ డిగ్రీ కళాశాలలను ప్రధాన పట్టణాల్లో ఏర్పాటు చేశారు. దీంతో క్యాంపస్ ఎంపికల్లో టీసీఎస్, ఐబీఎమ్, టెక్ మహేంద్ర వంటి కంపెనీలు రూ.లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలను ఇస్తున్నాయి. కళాశాలలో సీట్ల భర్తీపెంచేందుకు యాజమాన్యాలు క్యాంపస్ ఉద్యోగాలు అందిపుచ్చుకునేలా శిక్షణ ఇస్తున్నాయి. దీంతో విద్యార్థులు డిగ్రీ వైపు చూస్తున్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బెంగళూరు-కలబురగి (వయా గుంతకల్లు) మధ్య అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును వేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి ప్రత్యేక రైలు (నం. 06519) శుక్రవారం రాత్రి 10-40 గంటలకు బెంగళూరులో బయలుదేరి శనివారం ఉదయం కలబురగికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06520) కలబురగిలో శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11-55 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాద్‌నగర్ స్టేషన్ల మీదుగా వెళుతుందన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనరల్ బోగీలు

గుంతకల్లు మీదుగా వెళ్లే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా జనరల్ బోగీలను జతచేయనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముంబై-చెన్నై వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 22157) రైలుకు ఈ నెల 5వ తేదీ నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22158)కు ఈ నెల 8వ తేదీ నుంచి శాశ్వత ప్రాతిపదికన అదనంగా రెండు జనరల్ బోగీలను జతచేసి నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలుకు ఒక స్లీపర్, ఒక ఏసీ త్రీ టైర్ బోగీలను తగ్గించి వాటి స్థానంలో రెండు జనరల్ బోగీలను పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం ఈ రైల్లో రెండు జనరల్ బోగీలు ఉండగా, అ వి నాలుగుకు పెంచనున్నారు. బెంగళూరు-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (నం. 1659 3)కు ఈ నెల 5వ తేదీ నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 1659 4)కు ఈ నెల 7వ తేదీ నుంచి నెల రోజులపాటు అదనంగా ఒక జనరల్ బోగీని జతచేసి పంపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్రమాద సైరన్

గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని రేణిగుంట స్టేషన్‌లో రైలు ప్రమాదానికి సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించగా.. గుంతకల్లు స్టేషన్‌లో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సైరన్ మోగించారు. శుక్రవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రమాద హెచ్చరికగా సైరన్‌ను మోగించారు. ప్రమాద సమయాల్లో మెడికల్ వ్యాన్, మరమ్మతుల సిబ్బంది ఏమేరకు అప్రమత్తంగా ఉన్నారో పరీక్షించడానికి ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాద సైరన్ మోగగానే వైద్య, మెకానికల్ సిబ్బంది హుటాహుటిన ప్రత్యేక వైద్య రైలు వద్దకు చేరుకున్నారు. అది రేణిగుంటలో జరిగిన మాక్ డ్రిల్‌కు సంబంధించిన సైరన్ అని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఏ శాఖ సిబ్బంది ఎంత సమయంలో చేరుకున్నారనే విషయంగా టైం రికార్డు చేశారు.

పీ4పై సీఎం సమీక్షలో పాల్గొన్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీ4పై జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, సీపీఓ అశోక్‌కుమార్, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ ఈసెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

నిషేధిత జాబితాలోని చుక్కల భూములు, 22ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ, డీఎల్సీ/డీఎల్ఎస్సీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి వారం ఒక మండలం నుంచి డాటెడ్ ల్యాండ్స్, ఒక 22ఏ కేసులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో 22ఏకు సంబంధించి 19 క్లెయిమ్స్‌ను విచారించామని, నాలుగు ఆమోదించగా 13 తిరస్కరించామన్నారు. 2 దరఖాస్తులను పునఃపరిశీలించాలన్నారు. డాటెడ్ ల్యాండ్స్‌కు సంబంధించి ఒక క్లెయిమ్‌ను విచారించగా, ఆ కేసును పునఃపరిశీలించాల్సి ఉందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రేపు జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జిల్లా సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధృవీకరణ పత్రం, యూనిఫాం, క్రీడా సామగ్రితో హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9347217905, 9959514129లను సంప్రదించాలని కోరారు.

బీటీపీకి కృష్ణా జలాలను తరలిస్తాం

- ప్రభుత్వ విప్ కాలవ


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, జూలై 4(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టు(బీటీపీ)కు కృష్ణా జలాల తరలింపు ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో ఆగిపోయిన జీడిపల్లి - భైరవానితిప్ప పనులను శనివారం పునఃప్రారంభిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల రైతులకు ఈ ప్రాజెక్టు ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. గత టీడీపీ పాలనలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.968 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2019లో టీడీపీ పాలన ముగిసేటప్పటికే దాదాపు 30 శాతం పనులు పూర్తి చేసినట్లు వెల్లడిం చారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లపాటు ఈ పనులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాముఖ్యతను నేమకల్లు పర్యటనలో తాను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దానికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పనులు పునఃప్రారంభం అవుతున్న వేళ ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయు డు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హంద్రీనీవా సీఈ నాగరాజు, ఎస్ఈ స్వరూప్‌కుమార్ పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు ప్రత్యేక నిఘా

డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా పెట్టాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అధికారులను ఆదేశించారు. నవోదయం 2.0పై శుక్రవారం ఆయన స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. జిల్లాలో 104 సారా ప్రభావిత గ్రామాల్లో 51 గ్రామాలను సారా రహితంగా మార్చామన్నారు. తాడిపత్రి ఎక్సైజ్‌స్టేషన్, రాయదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించామన్నారు. మిగిలిన ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో నిఘా ఉంచి నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. దుకాణాల్లో మద్యం ఎక్కువ ధరకు అమ్ముతూ ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక, ఇతర సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ మద్యం రాకుండా అరికట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, అనంతపురం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, అనంతపురం అసిస్టెంట్ ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐలు సత్యనారాయణ, జయనాథరెడ్డి, అన్నపూర్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్లలో పోలీసుల తనిఖీ

అనంతపురం న్యూటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను నిరోధించడానికి గురువారం రాత్రి రైల్వే పోలీసులు, జీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. రైలు నెంబర్ 11014 కుర్ల ఎక్స్‌ప్రెస్‌లో దాదాపు అన్ని బోగీలను జాగిలాలతో తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణికులకు డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా ద్వారా తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రయాణికులకు 1972 టోల్ ఫ్రీ నెంబర్ గురించి తెలియజేస్తూ డ్రగ్స్ సమాచారం ఉంటే వెంటనే తెలపాలని కోరారు. కొంతమంది అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వివరాలు సేకరించి నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో జీఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, త్రీటౌన్ ఎస్ఐ వెంకటరమణ, నార్కోటిక్స్ డ్రగ్స్ ఎస్ఐ హనుమంతు, డాగ్స్ టీంతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారి మోసం.. రైతుల ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు

కొత్తచెరువు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొత్తచెరువుకు చెందిన దాల్‌మిల్ సూరి తమను మోసం చేశాడని రైతులు, వ్యాపారులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తూ.. సరుకు సరఫరా చేస్తానని సుమారు రూ.కోటి వరకు డబ్బులు తీసుకున్నాడని, ఇప్పటి వరకు సరఫరా చేయలేదని తాడిపత్రికి చెందిన రైతులు, వ్యాపారులు స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మారుతిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ తెలిపారు.

ఇరువెందులలో నిశ్శబ్దం

శింగనమల, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి హత్యతో మండలంలోని ఇరువెందుల గ్రామంలో నిశ్శబ్దం అలుముకుంది. పోలీస్ రికార్డుల్లో ఫ్యాక్షన్ గ్రామంగా ఉన్నా గత రెండు దశాబ్దాల నుంచి ఎలాంటి గొడవలు లేవు. అయితే గురువారం సాయంత్రం ఇంటి వద్ద దారి విషయంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన చిన్న ఘర్షణ శంకరప్ప(50) హత్యకు దారితీసింది. ఈ ఘర్షణలో హనుమన్న వర్గానికి చెందిన ఆరుగురు, దాసరి తిరుపాలు వర్గంలో ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులు అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. హత్య నేపథ్యంలో ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న గ్రామంలో మళ్లీ ఫ్యాక్షన్ మొదలవుతుందేమోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు వర్గాలపై కేసు: విజయ్‌కుమార్, ఎస్ఐ

మండలంలోని ఇరువెందుల గ్రామంలో గురువారం ఇంటి వద్ద దారి విషయంలో దాసరి తిరుపాలు, హనుమన్న కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో హనుమన్న వర్గానికి చెందిన శంకరప్ప మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. దాసరి తిరుపాలు వర్గంలో ఆరుగురు గాయపడ్డారు. తిరుపాలు వర్గానికి చెందిన 9 మందిపైన, హనుమన్న వర్గానికి చెందిన 8 మందిపైన కేసులు నమోదు చేశాం. గ్రామంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశాం.

విద్యార్థి సంఘాల నేతలపై కేసు

అనంతపురం క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ముగ్గురు విద్యార్థి సంఘాల నేతలు, మరికొందరిపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పాపురాయి సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాల వద్ద జరిగిన వివాదంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆలం, ఓబులేసు, నరసింహ తదితరులపై కేసు నమోదు చేశామని పోలీసులు శుక్రవారం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పుస్తకాలను విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు సిబ్బందిని ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు. పుస్తకాలను విక్రయించడం లేదని, కొరియర్ ద్వారా వెళుతున్నాయని ప్రిన్సిపాల్, సిబ్బంది వారికి చెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ప్రిన్సిపాల్ రాధిక విద్యార్థి సంఘాల నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డాక్టర్లు పాలనాధికారులు కాలేరా..?

● ఆశా నోటిఫికేషన్‌తో రుజువు

అనంతపురం వైద్యం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఒక చిన్న ఆశా కార్యకర్త పోస్టు నియామకం ప్రక్రియను పూర్తి చేయలేని డాక్టర్లు భవిష్యత్తులో ప్రమోషన్లు వస్తే ఎలా పనిచేస్తారోననే సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల రూరల్, అర్బన్ ప్రాంతాలలో 58మంది ఆశా కార్యకర్తల నియామకాన్ని చేపట్టారు. అభ్యర్థుల నుంచి గత నెల 25నుంచి 30వరకు దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను గ్రామీణ/పట్టణ ఆరోగ్య పారిశుద్ధ్య పౌష్టికాహార కమిటీ(వీహెచ్ఎస్ఎన్‌సీ/యూహెచ్ఎస్ఎన్‌సీ) పరిశీలించాలి. ఈ కమిటీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మహిళా సంఘ సభ్యురాలు, కార్యదర్శి ఇలా మొత్తం తొమ్మిది మంది ఉంటారు. దరఖాస్తుల్లో ప్రతిభ కల్గిన మూడింటిని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు కమిటీ సిఫార్సు చేయాలి. ఈ ప్రక్రియను మొత్తం సంబంధిత ఆరోగ్య కేంద్రం డాక్టర్ పర్యవేక్షించాలి. అయితే దరఖాస్తు గడువు ముగిసి నాలుగురోజులు గడిచినా ఒక్కో పోస్టుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో వైద్యుల వద్ద వివరాల్లేవు. దీన్ని బట్టి వారు భవిష్యత్తులో పాలనాధికారులు అయితే బాధ్యతలు ఎంతమేర నిర్వహిస్తారో అర్థం చేసుకోవచ్చు.

మెరిట్ లిస్ట్ ఎప్పుడో..?

నోటిఫికేషన్ మేరకు ఈ నెల రెండో తేదీకే అప్లికేషన్ స్క్రూటినీ అయిపోవాలి. మూడున ప్రొవిజనల్ లిస్ట్, 4న అభ్యంతరాల స్వీకరణ, 5న ఫైనల్ మెరిట్ లిస్టను ప్రదర్శించాలి. దరఖాస్తులు ఎన్ని వచ్చాయో తెలియకుంటే ఇక మెరిట్ లిస్టను ఎప్పుడు ప్రదర్శిస్తారని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

త్వరలోనే కలెక్టర్‌కు: డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

ఆశాకార్యకర్తల దరఖాస్తులు సంబంధిత ఆరోగ్య కేం ద్రం డాక్టర్ల నుంచి రావాలి. ఒక్కో పోస్టుకు ఎన్ని అప్లికేషన్‌లు వచ్చాయో వీహెచ్ఎస్ఎన్‌సీ/యూహెచ్ఎస్ఎన్‌సీ పరిశీలిస్తుంది. దరఖాస్తు దారుల్లో ప్రతిభ కల్గిన ము గ్గురి అప్లికేషన్‌లు ఆరోగ్యకేంద్రం డాక్టర్ నుంచి మాకువస్తాయి. వాటిని త్వరలోనే జిల్లా కలెక్టర్‌కు పంపుతాం..

నేడు శింగనమలకు ఎమ్మెల్యే రాక

శింగనమల, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరగనుందని, ఇందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరు కానున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు తప్పక హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

విజయనగర్ లా కాలేజీకి న్యాక్ బీ గ్రేడ్



న్యాక్ అక్రిడిటేషన్ సర్టిఫికెట్ చూపుతున్న కళాశాల వ్యవస్థాపకులు రామిరెడ్డి తదితరులు

అనంతపురంరూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి):నగరంలోని విజయనగర లా కాలేజీకి న్యాక్ బీ గ్రేడ్ దక్కినట్లు కళాశాల వ్యవస్థాపకుడు రామిరెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర చార్ వెల్లడించారు. ఆమేరకు శుక్రవారం కళాశాలలో వారు మీడియాతో మాట్లాడారు. కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్ దక్కడం సంతోషంగా ఉందన్నారు. కళాశాల నిర్వాహణ, మౌలిక సదుపాయలు, తరగతుల నిర్వాహణ, విద్యాబోధన తదితర అంశాలు న్యాక్ గ్రేడ్ రావడానికి దోహదం చేశాయన్నారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏఓగా మునీర్ అహ్మద్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా మునీర్ అహ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుమునుపు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న సుజాత గత నెలాఖరులో రిటైర్డ్ అయ్యారు. దీంతో ఆ స్థానంలోకి కర్నూలు జేడీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న మునీర్ అహ్మద్ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయనకు ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, సాంస్కృతిక కార్యదర్శి ఆదాం ఖాన్, ఉమ్మడి అనంత అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, బాలాజీనాయక్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ కార్యాలయాల ముట్టడి: సీపీఐ

అనంతపురం విద్య, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్మార్టుమీటర్లును బలవంతంగా బిగించి ప్రజావ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్ మండిపడ్డారు. నగరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరిట ఇప్పటికే రూ.15,485కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లను బిగించి మరింత ఇబ్బంది పెట్టేందుకు చూస్తోందన్నారు. దీన్ని నిరసిస్తూ శనివారం విద్యుత్‌కార్యాలయాల ముట్టడి చేపడుతున్నామన్నారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాల పిలుపునిచ్చారు.

స్మార్ట్ మీటర్లు.. ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి: సీపీఐ

శింగనమల: స్మార్ట్ మీటర్లను అమర్చరాదని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తరిమెల భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని తరిమెల, నిదనవాడ గ్రామాల్లో విద్యుతు భారాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి నిరసనలు తెలిపారు.

నేడు స్వర్ణాంధ్ర -2047 ప్రారంభం

శింగనమల, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర- 2047 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

కృత్రిమ కాళ్లు, చేతి కర్రల పంపిణీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం చెన్నైకి చెందిన ఫ్రీడమ్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సుందర్, ట్రస్ట్ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, ముంబైకి చెందిన సేవెక్స్ టెక్నాలజీస్ సంస్థ అధినేత లతా జోషిల సహకారంతో జిల్లాలో అర్హులుగా గుర్తించిన 195 మందికి రూ.25లక్షల విలువైన కృత్రిమ కాళ్లు, చేతికర్రలు అందజేశారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ చేతుల మీదుగా వాటిని ఉచితంగా పంపిణీ చేశారు. డీఆర్ఓ మలోల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడికి ఘన నివాళి

అనంతపురం క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని టీడీపీ నాయకులు ఘన నివాళి అర్పించారు. నగరంలోని నేషనల్ పార్కులో గల వివేకానందుడి విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ స్వామి వివేకానంద దేశం గర్వించదగ్గ మహనీయుడన్నారు. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పిన గొప్ప తత్వవేత్తని కొనియాడారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సాలర్‌బాషా, నగరమాజీ అధ్యక్షుడు క్రిష్ణకుమార్, మాజీ కార్పొరేటర్ శీన, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి శిరిశాల రాంబాబు, మాజీ కో- ఆప్షన్ మెంబర్ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా ముగిసిన వారాహి నవరాత్రులు

ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో సప్తమాతృకల పూజ


దర్శనమిస్తున్న వారాహిదేవి


ప్రత్యేక అలంకరణలో సప్తమాతృకలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతపురం టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రులు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో సప్తమాతృకల పూజ చేయడంతో పాటు అమ్మవార్లకు గాజులు, పసుకుకొమ్మలు, నల్లపూసలు, పగడాలు, గోమతి చక్రాలు, పూవులు ఇలా ఏడురకాల వస్తువులతో పూజించారు. ఆర్యవైశ్య మహిళామండలి ఆధ్వర్యంలో అమ్మవారికి చీర, సారె, ఒడిబియ్యం సమర్పించారు. మహిళలంతా సామూహిక కుంకుమార్చనలు, పుష్పార్చనలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మైలవరం నిర్మలాదేవి, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి


సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, తదితరులు

అనంతపురంరూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య, ఓఎస్‌డీ దేవన్న తదితరులు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర పోరాటంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కృషి మరువలేనిదన్నారు. జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్: స్థానిక నగరపాలక సంస్థ ఆవరణలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు గుండె వైద్యశిబిరం

రామగిరి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 6వ తేదీన ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు డాక్టర్ రామ్మోహన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురంలోని మార్క్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, యువనేతలు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థల సహకారంతో ఈ శిబిరాన్ని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. గుండె సమస్యలున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దళితుల స్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలి

గార్లదిన్నె, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : దళితుల శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటిరింగ్ కమిటీ సభ్యుడు బండారు కుళ్లాయప్ప కోరారు. ఈ మేరకు శుక్రవారం దళిత సంఘాల నాయకులతో కలిసి తహసీల్దార్ బండారు ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల వ్యాప్తంగా ఉన్న దళితుల శ్మశాన వాటికలకు సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. దీంతో అంత్యక్రియలు జరపాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అలాగే పలు శ్మశాన వాటికల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, కాపాడాలని కోరారు. ఎస్సీ ఎస్టీ పరిపరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా థియేటర్ల స్వర్ణోత్సవం

అనంతపురం టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన గంగ, గౌరి, గాయత్రి, గౌతమి నాలుగు థియేటర్లకు 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం ఆయా థియేటర్ల యజమాన్యాల కుటుంబ సభ్యుల సమక్షంలో స్వర్ణోత్సవ సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ప్రస్తుత కాలంలో ఒక్క స్క్రీన్ థియేటర్ నడిపించడమే కష్టమవుతున్న తరుణంలో దాదాపు 5 దశాబ్దాలుగా గంగ, గౌరి, గాయత్రి, గౌతమి థియేటర్లు సినీ ప్రేమికులకు సినిమా ఆనందాన్ని పంచుతున్నాయి. ఈ నేపథ్యంలో సదరు థియేటర్ల యజమానులు వెంకట నారాయణరెడ్డి, ఒన్నూరురెడ్డి, చిన్న వెంకటరెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డిలు తమ కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్ ఆవరణలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి


నారాయణరెడ్డి(ఫైల్)

చెన్నేకొత్తపల్లి, జూలై4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేటిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి(57) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఈయన ఇంటిలో ఉన్నఫలంగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకేఅమరేంద్ర, ఇతర నాయకులు ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జీపీఏటీలో ఓటీపీఆర్ఐ విద్యార్థుల ప్రతిభ

అనంతపురంరూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీపీఏటీ) ప్రవేశ పరీక్షలో జేఎన్‌టీయూఏ అనుబంధం తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ(ఓటీపీఆర్ఐ) విద్యార్థులు ప్రతిభచాటారు. జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించారు. డి.హేమంత్‌కుమార్(204ర్యాంకు), కె.గురుచరణ్(2484ర్యాంకు), జి.దేవిప్రియ(3828ర్యాంకు), ఎస్.కుశ్వంత్(4058ర్యాంకు)సాధించారు. విద్యార్థులను సంస్థ సంచాలకులు ఆచార్య జీవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీనాథ్, బోధనా సిబ్బంది అభినందించారు.

బదిలీ టీచర్లకు జీతాలు ఇవ్వండి: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, జూలై 4(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం విద్యాశాఖ ఏడీ శ్రీనివాసులును వారు కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో జిల్లాలో వేలాది మంది ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లారన్నారు. కొత్తపాఠశాలలో చేరి నెలరోజులైనా ఇంకా జీతాలు మంజూరుకాలేదన్నారు. శనివారం మొహర్రం పండుగను పురష్కరించుకొని పాఠశాలన్నింటికీ ఆప్షనల్ హాలిడే ఇవ్వాలని ఏడీకి వినతి పత్రం ఇచ్చారు.

వైశ్యజాతి మణిహారం రోశయ్య

అనంతపురం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వైశ్యజాతికి మణిహారం లాంటివారని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముడియం రమణ పేర్కొన్నారు. రోశయ్య 92వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ముడియం రమణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా విశేష కృషి చేయడంతోపాటు రాజకీయాల్లో కొణిజేటి రోశయ్య తనదైన మార్కు వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు నగరూరు చంద్రమహేష్, చిందమూరు నాగరాజు, భూపాలం ప్రభాకర్, ఇల్లూరి సురేష్, శివ పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల బిగింపుపై అవగాహన

అనంతపురం అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు పొలాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల బిగింపులో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో శుక్రవారం డ్రిప్ కంపెనీల జిల్లా కోఆర్డినేటర్లు, ఇంజనీర్లకు డ్రిప్ పరికరాల బిగింపుపై ఆయన అవగాహన కల్పించారు. డిజైన్ మేరకు పరికరాల బిగిస్తేనే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ విషయంలో ఎవరూ అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. దీనిపై రైతులకు వివరించాలని తెలిపారు. ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి, ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ, ఏడీలు దేవానంద్, రాజాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దత్తతకు ముందుకురండి

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
●25 కుటుంబాలకు మార్గదర్శిగా ఎమ్మెల్యే కుమార్తె


తండ్రి దగ్గుపాటితో ఆశ్రిత

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గం పరిధిలో అత్యంత పేద కుటుంబాలను దత్తత తీసుకుని, బంగారు కుటుంబాలుగా మార్చేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ తొలి సమావేశం రాజధాని అమరావతిలో శుక్రవారం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యే దగ్గుపాటి, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి కార్పొరేషన్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూసీఎం ఆదేశాలతో అర్బన్ నియోజకవర్గంలో అత్యంత నిరుపేద స్థితిలో ఉన్న 5651 కుటుంబాలను గుర్తించామన్నారు. ఆయా కుటుంబాలను దత్తత తీసుకుని మార్గదర్శకులుగా మారేందుకు ముందుకు రావాలని వి ద్యాసంస్థలు, వ్యాపార వర్గాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగస్వామి అయ్యేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి కుమార్తె అశ్రిత ముందుకు వ చ్చారు. దగ్గుపాటి ఫౌండేషన్ ద్వారా 25కుటుంబాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆశ్రిత తెలిపారు. కమిషనర్ బాలస్వామితో పాటు పీ4 సిబ్బంది ఆమెను అభినందించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ కమిషనర్ పావని, తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ దివాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తాం

● సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే పరిటాల సునీత


ముక్తాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలకు ఇది తొలి అ డుగు మాత్రమేనని, రానున్న నాలుగేళ్లలో మ రింత అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముక్తాపురం గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ కాలనీల్లో ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు అందజేస్తూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. తర్వాత ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసి న సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషంగా చెబుతున్నారన్నారు. వచ్చే నాలుగేళ్లలో మరిన్ని పథకాలు అందిస్తామని, మరెన్నో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. టీడీపీ కన్వీనర్ యాతం పోతలయ్య, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి, డీసీఎంస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మాజీ ఎంపీపీ ముకుందనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు రాజాక్రిష్ణ, బిల్లే దాము తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం..

కనగానపల్లి : గత వైసీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్షంతో కనగానపల్లిలో నీటి శుద్ధి ప్లాంట్ మూతబడింది. దీనిపై గత ఏప్రిల్ 18న నిరుపయోగంగా నీటిశుద్ధిప్లాంటు అనే వార్త ఆంధ్రజ్యోతిలో ప్ర చురుతమైంది. ఇందుకు స్పందించిన టీడీపీ నా యకులు పరిటాల రవీం ద్ర ట్రస్టు సహకారంతో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం ప్రారంభించి మంచినీటిని మహిళలకు అందజేశారు. సర్పంచ్ అంకే రామక్రిష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నసనకోటలో విత్తన కందుల పంపిణీ

రామగిరి: మండలంలోని నసనకోట గ్రా మంలో రైతులకు ఉచితంగా విత్తనకందుల పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యఅతిథిగా హాజరై ఎల్ఆర్‌జీ 52,105 రకం విత్తన కందులను పంపిణీచేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందజేసే విత్తన కందులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడీ లక్ష్మీనాయక్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ గంగావతి, ఏఓ కవిత, సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ

రాప్తాడు: మండలకేంద్రంలోని జాతీయ రహదారి పక్కన అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మూసివేయించారన్నారు. పేదల ఆకలి తీర్చే వీటిని మూసివేయించడం దుర్మార్గమన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు మళ్లీ వాటిని అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. సర్పంచ్ తిరుపాలు, నాయకులు శీనయ్య, హంపాపురం జయప్ప, మరూరు గోపాల్, యర్రగుంట నారాయణస్వామి, బీరన్న, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, క్లస్టర్ ఇన్‌చార్జి నారాయణస్వామి పాల్గొన్నారు.

గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఎంపీ


కుళ్లాయిస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

నార్పల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్న సరిగెత్తు జరిగింది. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు తదితరులు కుళ్లాయి స్వామి, ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కల్పించిన ఏర్పాట్లపై ఎంపీ ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ మమత దేవి, ఆలయ ఈఓ శోభ, ఈఓఆర్డీ శైలజరాణి, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ జనార్ధన్, విద్యుత్ ఏఈ నీలకంఠచ జడ్పీ మాజీ కోఆప్షన్‌సభ్యుడు జాఫర్‌వలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

కుళ్లాయిస్వామి చిన్నసరిగెత్తు సందర్భంగా ఆలయ పరిసరాలలో భద్రత ఏర్పాట్లను డీఎస్పీ వెంకటేశులు పరిశీలించారు. అగ్నిగుండం సెగ భక్తులకు తగలకుండా గుడివైపు బారికెడ్లు ఏర్పాటు చేయించారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె విరమణ


కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై4(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని గత 15రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెను నగరపాలిక కమిషనర్ బాలరాజు శుక్రవారం విరమింపజేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఉన్న దీక్షా శిబిరానికి కమిషనర్ వచ్చి కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. అంతకుముందు నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు లాలూ, అబూసలేహాలు కార్మికుల దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, కార్మికులు సూర్యనారాయణ, పుల్లయ్య, నూర్‌బాషా, సురేష్‌బాబు, జగదీష్, రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

శిథిలావస్థ ట్యాంకు కూల్చివేత

అనంతపురంరూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరి నగర్‌లో గత కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకును శుక్రవారం కూల్చివేశారు. ఆ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు నిత్యం భయాందోళనలకు గురవుతుండేవారు. వారి ఆందోళనను గమనించిన స్థానిక టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి శుక్రవారం ఆ ట్యాంకును కూల్చి వేయించారు. టీడీపీ మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

అనంతపురం టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) అనంతపురం డిపో కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండురోజుల ధర్నా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని డిపో వద్ద ఈయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ... పోలీసు శాఖలోని ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పిస్తున్న తరహాలోనే ఆర్టీసీ ఉద్యోగులకూ వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఇంకా అనేక సమస్యలు ఆర్టీసీ ఉ ద్యోగులు ఎదుర్కొంటున్నారని, వాటన్నింటి పరిష్కారించాలని కోరారు. ఎం ప్లాయీస్ యూనియన్ అనంతపురం డిపో అధ్యక్షుడు ఎస్‌హెచ్ఆర్ ఖాన్, జోనల్ నాయకులు కొండయ్య, విశ్వనాథరెడ్డి, రీజియన్ నాయకులు పాల్గొన్నారు.

క్లాత్‌బ్యాగ్‌ల తయారీపై అవగాహన సదస్సు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా క్లాత్‌బ్యాగ్‌ల తయారీపై అవగాహన సదస్సును స్థానిక నగరపాలక సంస్థ న్యూ కౌన్సిల్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. నగరపాలిక కమిషనర్ బాలస్వామి హాజరై మాట్లాడారు. మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళల స్వయం ఉపాధికి క్లాత్‌బ్యాగుల తయారీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మెప్మా ద్వారా క్లాత్ బ్యాగుల తయారీ చేయించేందుకు అవసరమైన క్లాత్, కుట్టిన కూలీ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సామాజికసేవ కార్యకర్త ఏజీ అనిల్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఇప్పటికే తొలివిడత క్లాత్‌బ్యాగ్‌ల తయారీ కేంద్రం ప్రారంభించామని, రెండో విడతలో డ్వాక్రా సంఘాల్లో ఉన్న 200మంది మహిళలతో ప్రారంభిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రణ, ప్రత్యామ్నాయంగా క్లాత్‌బ్యాగ్‌ల తయారీ, వినియోగంపై అనంతను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతామని పేర్కొన్నారు. మెప్మా పీడీ విశ్వజ్యోతి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని, మెప్మా సీఎంఎం కాటమయ్య, సీఓలు, ఆర్‌పీలు, సభ్యురాళ్లు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు: సీపీఐ

అనంతపురం రూరల్, జూలై4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున విమర్శించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆత్మకూరు మండల సహాయ కార్యదర్శి శివ అధ్యక్షతన రాప్తాడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో మల్లికార్జునతో పాటు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ హాజరయ్యారు మల్లికార్జున మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలు పూర్తవుతున్నా జిల్లాలో హంద్రీనీవా పనులు పూర్తి కాలేదన్నారు. రాయలసీమ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేని స్థితి రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గం సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రూరల్ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నరేష్, ఆత్మకూరు మండల కార్యదర్శి రామకృష్ణ, రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి, గిరిజన సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

శింగనమల, జూలై4(ఆంధ్రజ్యోతి): శింగనమల గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. కార్మికులకు పూలమాలలు, శాలువాలతో సన్మానం చేశారు. తర్వాత దుస్తులను పంపిణీ చేశారు. డిప్యూటి తహసీల్దార్ సూర్యప్రతాప్, సంఘం జిల్లా నాయకులు తరిమెల రామాంజినేయులు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి మోహన్‌రంగా జయంతి

అనంతపురం టౌన్/ అనంతపురం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీనివాసనగర్‌లో గల బలిజ మహాసంఘం కార్యాలయంలో శుక్రవారం వంగవీటి మోహన్‌రంగ 78వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు తొండపునాటి శంకరయ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఇందులో బలిజ సంఘం నాయకులు పాల్గొని వంగవీటి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. విజయవాడ ప్రాంతానికి చెందిన వంగవీటి రంగా చివరిశ్వాస వరకు పేదలకు అండగా నిలబడ్డారని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాయలసీమ బలిజ మహాసంఘం యువజన విభాగం అధ్యక్షుడు తొండపునాటి రమేష్, కార్యవర్గ సభ్యులు కోనేటి సాయిప్రసాద్, పున్నం విజయభాస్కర్, పాములాయి వెంకటేశ్వర్లు, చలపతి, జీవీ రమణ, సురేష్, నాగేంద్రప్రసాద్, రవికుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వంగవీటి రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

నేడు బీటీపీ పనుల పునఃప్రారంభం


రుద్రంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు జీవనాడి అయిన బీటీపీ కాలువ పనులను శనివారం పునఃప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో తనతో పాటు మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొంటారన్నారు. ఈ పనులు పూర్తి అయితే నియోజకవర్గంలోని 114 చెరువులను నీటితో నింపవచ్చన్నారు.

● కుందుర్పి : మండలంలోని రుద్రంపల్లిలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వివరించారు.

ఆసుపత్రి పరిశీలన

తాడిపత్రి, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. సమస్యలపై ఆరా తీశారు.

సమ్మె తాత్కాలిక విరమణ

గుంతకల్లుటౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెను తాత్కాలికంగా విరమించామని, శనివారం నుంచి విధులకు హాజరవుతామని ఆ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎం మల్లేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చేందుకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన విభాగం 15 రోజులు సమయం కోరిందని, దీంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

యాడికి, జూలై 4(ఆంధ్రజ్యోతి): అదాని కంపెనీ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై నిరుద్యోగ యువతకు త్వరలో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు శుక్రవారం తెలిపారు. ఈ శిక్షణ మూడునెలల పాటు ఉంటుందని, ఆసక్తి ఉన్న నిరుద్యోగులు తమపేర్లను మండల పరిషత్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

అర్హుల జాబితా విడుదల

పుట్లూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఆయా రైతుసేవా కేంద్రాల్లో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి కాత్యాయిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో లేని రైతులు 155251కు ఫోన్ చేయాలని, లేదా రైతుసేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలో మైనార్టీలు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అలివేలమ్మ శుక్రవారం తెలిపారు. మండలానికి మొత్తం నాలుగు యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని.. సంబంధిత దరఖాస్తును ఎంపీడీఓ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో స్వయం ఉపాధి పథకాల కోసం డ్రైవింగ్ లైసెన్సు, జనరిక్ ఫార్మసీ పథకం కోసం బీఫార్మసీ, ఎంఫార్మసీ తప్పనిసరిగా ఉండాలన్నారు.

సమ్మె నోటీసు అందజేత

తాడిపత్రి, జూలై 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును సీడీపీఓ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఇందులో యూనియన్ సెక్టార్ లీడర్ శంకరమ్మ, సీఐటీయూ నాయకుడు ఉమాగౌడ్ పాల్గొన్నారు.

రేపు దంత వైద్య శిబిరం

పామిడి, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షుగర్ పరీక్షలు

గుంతకల్లుటౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కే రోశయ్య జయంతిని పురష్కరించుకుని స్థానిక కసాపురం రోడ్డులోని మంజు మెడికల్ షాప్ వద్ద శుక్రవారం అవోపా ఆధ్వర్యంలో 90 మందికి ఉచిత షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఇందులో అవోపా అధ్యక్షుడు దారా రాము, సెక్రెటరీ కొప్పరపు సుబ్రహ్మణ్యం, జయంతి వెంకట్ పాల్గొన్నారు.

స్టోర్ సీజ్

గుత్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలోని 57న స్టోర్‌ను విజిలెన్స్ ఎస్‌ఐ గోపాలుడు శుక్రవారం తనిఖీ చేశారు. సరుకులలో తేడాలు ఉండటంతో ఆ స్టోర్‌ను సీజ్ చేశారు. 6ఏ కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దాడుల్లో ఏఈ రవీంద్ర, సీఎస్‌డీటీ ప్రవీణ్‌కుమార్, వీఆర్వో ఆదినారాయణమ్మ పాల్గొన్నారు.

చీఫ్ ఉపాధ్యక్షుడిగా ఎర్రిస్వామి

ఉరవకొండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ చీఫ్ ఉపాధ్యక్షుడిగా ఉరవకొండ డిపోలో పనిచేస్తున్న కండక్టర్ ఎర్రిస్వామి ఎన్నికయ్యారు. ఈ మేరకు కార్మిక పరిషత్ రాష్ట్ర కార్యదర్శి అంజినేయులు ఉత్తర్వులు జారీ చేశారు.

స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు

యాడికి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. పోరుమామిళ్లలోని వివేకానంద ఫౌండేషన్ ఫౌండర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.50 వేలు వెచ్చించి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా


గుత్తిలో ధర్నా చేస్తున్న నాయకులు

గుత్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా శుక్రవారం నిర్వహించారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సొంతంగా ప్రభుత్వ సహాయ సహకారాలతో కొనుగోలు చేయాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని, కాలం చెల్లిన బస్సులకు గ్యారేజ్ సిబ్బందిని బాధ్యులను చేసి అక్రమంగా పనిష్మెంట్ ఇస్తున్న విధానాన్ని అరికట్టాలని అన్నారు. ఇందులో జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్ ఆంజనేయులు, రీజినల్ కమిటీ సభ్యులు హుసేన్ సాహెబ్, డిపో కార్యదర్శి గంగేశ్వర్, డిపో అధ్యక్షుడు వాసులు, నాయకులు పాల్గొన్నారు.

● తాడిపత్రి : స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో యూనియన్ నాయకులు ఆదినారాయణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామలింగారెడ్డి, యుగంధర్‌రెడ్డి, శ్రీనివాసులు, సతీష్‌రెడ్డి, బాషా పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గం : స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎర్రబ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు, యూనియన్ నాయకులు నిరసన తెలిపారు. ఇందులో డిపో ప్రెసిడెంట్ వేణుగోపాల్, సెక్రటరీ విజయ్, చెన్నయ్య, గ్యారేజీ సెక్రెట్రి ప్రతాప్, శేఖర్, యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్.. కష్టం!

● వర్షం కోసం ఎదురుచూపులు
● రోజూ ఊరిస్తున్న మేఘాలు
● ఎండుతున్న ముందస్తుగా వేసిన పంటలు

యాడికి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు వర్షాలకు సాగుచేసిన పంటలు ప్రస్తుతం వర్షం రాక ఒకవైపు ఎండు దశకు చేరుకోగా.. విత్తుకు గడువు దాటిపోతుండడంతో మరోవైపు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజూ ఆకాశంలో ఊరిస్తున్న మేఘాల వైపు చూస్తూ.. ఎప్పుడు వర్షం పడుతుందోనని ఎదురుచూస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో మండలంలో 9,817 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 710 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు చేశారు. ముం


విత్తుకోసం సిద్ధం చేసుకున్న పొలం

దస్తు వర్షాలతో ప్రస్తుతం వరకు పత్తి 511 హెక్టార్లు, మొక్కజొన్న 151 హెక్టార్లు, వేరుశనగ 20 హెక్టార్లు, కంది 20 హెక్టార్లు, సజ్జ 18 హెక్టార్లు మాత్రమే సాగుచేశారు. గతేడాది ఖరీఫ్‌తో పోలిస్తే ఈ సారి చాలా తక్కువ శాతం. విత్తు సాగుకు అనుకూలమైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు.

● అందని కరువు సాయం : వర్షాభావ పరిస్థితుల్లో మూడేళ్లుగా కరువు మండలంగా ప్రకటిస్తూనే ఉన్నారని, కానీ కరువు సహాయక చర్యలు అందించింది మాత్రం శూన్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా వర్షాలు సరిగా పడకపోతే అప్పులు మూటగట్టుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వాన కోసం..



వేరుశనగ సాగు కోసం ఐదెకరాలు సిద్ధం చేసుకొని ఉంచాను. వర్షం రావడమే తరువాయి. పోయిన ఏడాది ఈ సమయానికి వేరుశనగ విత్తనాన్ని సాగు చేశాను. ఈ ఏడాది సరైన సమయంలో వర్షం పడకపోవడంతో పంట సాగుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిరోజూ ఆకాశంలో మేఘాలు ఊరిస్తున్నాయే తప్పా.. వాన రావడం లేదు. వారం రోజుల్లో వాన రాకపోతే సాగు కష్టమే.

- రాంమోహన్, రైతు పిన్నేపల్లి

పత్తి పంట తొలగించా



ఖరీఫ్‌లో ముందస్తు కురిసిన వర్షాలకు ఐదెకరాల పత్తి విత్తనం నాటాను. తర్వాత వర్షాలు పడకపోవడంతో విత్తనాలు సరిగా మొలకెత్తక విత్తనాన్ని అంతా దున్నివేశాను. తర్వాత పడ్డ వర్షాలకు మరళా ఐదు ఎకరాల్లో పత్తి విత్తనం నాటాను. విత్తనం మొలకెత్తినా వర్షాలు లేక ఎదుగుదల ఏ మాత్రం లేదు. మరళా పంటను తొలగించాలని అనుకుంటున్నాను.

- నాగిరెడ్డి, రైతు, చిక్కేపల్లి

ఇంకా సమయముంది

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు సాగు అయిన పంటలశాతం చాలా తక్కువే. ముందస్తు వర్షాలకు కొన్ని గ్రామాల్లో పత్తిపంట సాగుచేశారు. విత్తనం సరిగా మొలకెత్తకపోవడం, మొలకెత్తిన తర్వాత వర్షాలు లేక ఎదుగుదల లేకపోవడం లాంటి కారణాలతో కొందరు రైతులు పత్తి పంటను తొలగించారు. ఆగస్టు మొదటివారం వరకు పత్తిపంట సాగుకు అనుకూలంగా ఉంటుంది.

- మహబూబ్‌బాషా, ఏఓ

కాచి చల్లార్చిన నీటినే తాగండి

మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్



కళ్యాణదుర్గం, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సరఫరా అయ్యే శ్రీరామిరెడ్డి నీటిని ప్రజలు కాచి.. చల్లార్చుకొని.. తాగాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ శుక్రవారం సూచించారు. మూడు నెలల నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలో ఉండడంతో నీటిని సరఫరా చేయలేదని, ప్రస్తుతం నీటిని సరఫరా చేస్తుండటంతో నీరు కొద్దిగా ఎరుపు రంగులో వస్తోందని తెలిపారు. ఈ సమస్య మూడు రోజుల పాటు ఉంటుందని, కావున ప్రజలు ఆ నీటిని నేరుగా తాగకుండా.. కాచి .. చల్లార్చుకొని తాగాలని సూచించారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న తోటి సిబ్బంది, గ్రామ పెద్దలు

కళ్యాణదుర్గం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హులికల్లు మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయుడు, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం ఆ గ్రామంలో తోటి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచు, విద్యా కమిటీ చైర్మన్, హెచ్‌ఎం ఘనంగా సన్మానించారు.

నేడు హనుమాపురంలో పెద్ద సరిగెత్తు


హనుమాపురంలో కొలువుదీరిన లాలూస్వామి పీర్లు

కణేకల్లు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి చెందిన హనుమాపురంలోని లాలూస్వామి పీర్ల పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ జయరాంచౌదరి, టీడీపీ ఎంపీటీసీ నరేంద్ర, తూర్పు రఘునాథ్, ఆలయ పెద్దలు, గ్రామస్థులు తెలిపారు. జిల్లాలో గూగూడు తర్వాత అత్యంత ప్రసిద్ధి చెందిన హనుమాపురం లాలూస్వామి పీర్ల ఉత్సవాలను ఏటా లాగే ఈ సారి కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. శనివారం సాయంత్రం పానకాలు, పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని, ఆదివారం జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

చెత్తసేకరణపై తనిఖీ

కూడేరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చెత్త సేకరణను జిల్లా పంచాయితీ అధికారి నాగరాజు నాయుడు శుక్రవారం తనిఖీ చేశారు. చెత్త సేకరణ ఎలా జరుగుతుందో అని ఆరా తీశారు. చెత్తతో వర్మీకంపోస్ట్ తయారు ఎలా జరుగుతుందో కార్మికులను అడిగి తెలుసుకున్నారు.

● ఉరవకొండ : స్థానిక రెండో సచివాలయం పరిధిలో ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని డీపీఓ నాగరాజు నాయుడు పరిశీలించారు. అనంతరం మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ సిబ్బంది ఉన్నారు.

● శెట్టూరు : మండలంలోని యాటకల్లులోని చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని జడ్పీ సీఈఓ శివశంకర్ శుక్రవారం పరిశీలించారు. అలాగే మంగంపల్లి గ్రామంలో వీధులను పరిశీలించారు. 15 రోజులకు ఒక రోజు మాత్రమే చెత్త సేకరణకు వస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో.. ఆయన పంచాయతీ కార్యదర్శి రుద్రన్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ జిలాని బాషా ఉన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నేడు నిరసన

యాడికి, జూలై 4(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ శుక్రవారం తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా విద్యుత్ చార్జీలను పెంచడం తగదన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


బేతాపల్లిలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

సోలార్ ప్రాజెక్టుపై అపోహలు నమ్మొద్దు

గుత్తి రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రెన్యూ సోలార్ ప్లాంటుకు భూములు ఇచ్చే రైతులు అపోహలు నమ్మొరాదని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. శుక్రవారం మండలంలోని బేతాపల్లి గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో కొంత మంది లేని పోనివన్నీ సోషల్ మీడియాలో పెడుతున్నారని, రైతులను ఎవరైన బెదిరిస్తే వారి తాట తీస్తానని, రైతులకు అండగా తాను ఉంటానని అన్నారు.

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాయకులు గుత్తి మండలం బేతాపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి.. ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు బర్ధీవలి, ఎంకే చౌదరి, టీడీపీ నాయకులు, ప్రతాప్, చికెన్‌శీనా, చిన్నరెడ్డి యాదవ్, రమేష్, శ్రీనివాస్ చౌదరి, నాగేంద్ర, ఇషాక్ పాల్గొన్నారు.

● 'స్వర్ణాంధ్ర విజన్'పై సమీక్ష

గుంతకల్లు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047పై వివిధ శాఖాల అధికారులతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమీక్ష నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్-2047ను సాకారం చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషిచేయాలన్నారు. ఇందులో ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, తలారి మస్తానప్ప, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి లక్ష పుష్పాలంకరణ


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు

గుత్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం లక్ష్మీదేవికి లక్ష పుష్పాలంకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అషాడమాసం పురస్కరించుకుని అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

శాకంబరిగా అమ్మవారు



యాడికి, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆకు కూరలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే స్థానిక పెద్దమ్మ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా సుదర్శన జయంతి



గుంతకల్లు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురంలో వెలసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి రాతి దేవాలయంలో శుక్రవారం సుదర్శన జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మూలవిరాటుకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


విఠోబస్వామి

పామిడి, జూలై 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక రంగ సుబేపిర్కా భగవాన్‌దాస్ విఠోబస్వామి దేవాలయంలో విఠల రుక్మిణిదేవి సమేత విఠోబస్వాముల వారి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి 11వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఏ క్రిష్ణయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులవ్వాలని కోరారు.

విధులకు రాకున్నా.. వచ్చినట్లు మాయ ..!

పాల్తూరు వార్డు సచివాలయ సెక్రటరీ మాయాజాలం - ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

విడపనకల్లు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ పరిజ్ఞానంతో మాయ చేయవచ్చని ఓ సచివాలయ ఉద్యోగి నిరూపించారు. మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన వీణా కుమారి అనంతపురంలో కాపురం ఉంటూ పాల్తూరులో సచివాలయ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే విధులకు హాజరు కాకుండానే అయినట్లు కంప్యూటర్ పరిజ్ఞానంతో చేస్తున్న మోసాన్ని అధికారులు గుర్తించి గతంలోనే హెచ్చరించారు. అయినా ఆమెలో మార్పు రాలేదు. శుక్రవారం ఉదయం 6.39 గంటలకే పాల్తూరులో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఫొటోలు సృష్టించి, మండల గ్రూపుల్లో షేర్ చేశారు. దీన్ని గమనించిన కొంతమంది టీడీపీ నాయకులు గ్రామంలో ఆరా తీసి.. పాత ఫొటోలతో మాయ చేశారని తెలుసుకున్నారు. ఉదయం 9.30 గంటలకు సచివాలయం వద్దకు వెళ్లి ఆరా తీశారు. మధ్యాహ్నమైనా విధులకు ఒక్కరు మాత్రమే వచ్చినట్లు తెలుసుకొని వీణాకుమారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

విచారించి, చర్యలు తీసుకుంటాం

వీణకుమారి విషయమై అనేక సార్లు ఫిర్యాదులు వచ్చాయి. పద్ధతి మార్చుకోవాలని ఎంపీడీఓ కార్యాలయానికి పిలిపించి పలుమార్లు హెచ్చరించాం. శుక్రవారం కూడా పాల్తూరు గ్రామానికి రాలేదని, చెత్త సేకరణ కూడా చేయలేదనే విషయం మా దృష్టికి వచ్చింది. పాత ఫొటోలను మార్ఫింగ్ చేసి, పాల్తూరు లోకేషన్‌లో ఉన్నట్లు ఫొటోలను గ్రూపుల్లో షేర్ చేసినట్లు తెలిసింది. విచారించి చర్యలు తీసుకుంటాం.

- సత్యబాబు, ఈఓఆర్డీ



ఖాళీగా సచివాలయం, అనంతపురంలో ఉండి పాల్తూరులో ఉన్నట్లు గ్రూప్‌లో పెట్టిన ఫొటో

క్రైం న్యూస్..

దొంగ బైకుల విక్రేతల అరెస్ట్

తాడిపత్రి, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో తక్కువ డిపాజిట్ చేసి.. తప్పుడు ప్రూఫ్‌లతో ఫైనాన్స్‌లో పలువురు దుండగులు బైక్‌లు కొన్నారు. కంతులు చెల్లించకుండా వాటిని తక్కువ ధరకు వివిధ ప్రాంతాల్లో విక్రయించారు. ఫైనాన్స్ వారు ఫిర్యాదు చేయడంతో ఆ వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాము. ఇప్పటికే దాదాపు 91 వాహనాలను సీజ్ చేశాం ..' అని అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. పెనుకొండకు చెందిన గయాజుద్దీన్, అనంతపురానికి చెందిన నూర్‌మహమ్మద్, తాడిపత్రికి చెందిన ముస్తాక్‌ఖాద్రీ, రోషన్, ఇంతియాజ్, సయ్యద్ ఖలీముల్లాను అరెస్ట్ చేశామని, ప్రధాన సూత్రధారి కోసం గాలిస్తున్నామని తెలిపారు. తాడిపత్రి సబ్‌డివిజన్ పరిధిలోని 70, ఇతర ప్రాంతాల నుంచి 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా దొంగబండ్లను విక్రయించిన వారు స్వయంగా వచ్చి బండ్లను అప్పగిస్తే వారిపై కేసు లేకుండా చేస్తామన్నారు. ఇంకా వందల సంఖ్యలో ట్రాక్టర్లు, జేసీబీలు, బైక్‌లు ఉన్నాయని, వాటిపైన మరింత లోతుగా విచారణ చేపడుతున్నామని అన్నారు.

దొంగకు దేహశుద్ధి


నిందితుడ్ని పట్టుకున్న స్థానికులు

తాడిపత్రి, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుంకులమ్మ పాలెంలో శుక్రవారం ఒక మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేయడానికి యత్నించిన ఓ యువకుడిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

అనుమానితుడి అరెస్ట్

యాడికి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనుప్పలపాడులో జరిగిన చోరీకి సంబంధించి రాజకుళ్లాయప్ప అనే అనుమానితుడిని శుక్రవారం అరెస్ట్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. జూన్ 30న ఆ గ్రామంలో ఒక ఇంటిలో దొంగలు రూ.70 వేలు విలువజేసే బంగారు ఆభరణాలు చోరీ చేశారని, బాధితురాలు శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని తెలిపారు. శుక్రవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజకుళ్లాయప్పను అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్

శెట్టూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాటకల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి రుద్రన్నకు షోకాజ్ నోటీసు అందజేసినట్లు ఎంపీడీఓ జిలాని బాషా శుక్రవారం తెలిపారు. జడ్పీసీఈఓ ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసు అందజేసినట్లు తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

యాడికి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లిలో జయ గంగిరెడ్డి, మహాదేవరెడ్డిల మధ్య తోటలకు వెళ్లే రస్తాపై వివాదం ఉంది. శుక్రవారం ఇదే విషయమై ఇరువర్గాలు ఘర్షణపడ్డాయి. ఇందులో గాయపడిన జయగంగిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డిని తాడిపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో...

గుత్తిరూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన మద్దిలేటి, వెంకటరాముడు గాయపడ్డారు. వీరు బైక్‌పై స్వగ్రామం నుంచి గుత్తికి వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. గాయపడిన వీరిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

జూనియర్ లైన్‌మన్‌పై దాడి

రాయదుర్గం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): కరెంట్ బిల్లు చెల్లించాలని అడిగినందుకు జూనియర్ లైన్‌మన్ జనార్ధన్‌పై గాంధీ స్కూల్ సమీపంలో నివాసముంటున్న అరవ నాగభూషణం శుక్రవారం దాడి చేశాడు. కరెంట్ బిల్లు కట్టకపోతే సర్వీస్ వైర్ కట్ చేస్తానని జనార్ధన్ అనడంతో.. నాగభూషణం దుర్భాషలాడుతూ.. దాడి చేసి.. ఇష్టం వచ్చిన వాళ్లకు చెప్పుకో అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీనిపై జనార్ధన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి : విప్



రాయదుర్గం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు తప్పకుండా అందాలన్నారు. సమాజంలో పేదలను ఆదుకోవడానికి దాతల ద్వారా అవసరమైన సహాయాన్ని అందించేలా పీ 4 విధానాన్ని ప్రభుత్వం రూపొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మార్కెట్ చైర్మెన్ హనుమంతరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

● మండలంలోని ఆవులదట్ల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విప్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ సంవత్సరంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ వన్నూరుస్వామి, ప్రసాద్ వెంకటేష్‌నాయక్, రామస్వామి, కాట వెంకటేశులు, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నగదు బహుమతి అందజేత


విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న రామసుబ్బమ్మ

పెద్దవడుగూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో ప్రతిభ చాటిన ప్రశాంతి, స్రవంతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు బహుమతిని వారి తల్లిదండ్రులకు శుక్రవారం అందజేశారు. స్థానిక దివంగత మాజీ సర్పంచు బాల చెన్నారెడ్డి జ్ఞాపకార్థం ఆయన చెల్లెలు రామసుబ్బమ్మ ఈ నగదును అందజేశారు.

హెచ్చెల్సీ పనుల పరిశీలన

బొమ్మనహాళ్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనహాళ్, దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని ఉద్దేహాళ్, మల్లికేతి, నాగలాపురం, దర్గాహొన్నూరు గ్రామాల వద్ద జరుగుతున్న వంతెన, లైనింగ్ పనులను అనంతపురం హెచ్చెల్సీ ఎస్ఈఈ విశ్వనాథ్‌రెడ్డి, ఈఈ పార్థసారథి శుక్రవారం పరిశీలించారు. ఎగువ కాలువకు నీరు ఈ నెల 10న విడుదల చేస్తారని, అంతలోపు ఈ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

● కణేకల్లు : యర్రగుంట వద్ద జరుగుతున్న హెచ్చెల్సీ పనులను ఆ శాఖ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట డీఈ దివాకర్‌రెడ్డి, ఏఈ నరేంద్రమారుతి, నసిరుద్దీన్ ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

గుంతకల్లు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గ ఏర్పాటుకు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియలో శుక్రవారం నామినేషన్ల పర్వం ముగిసింది. ఈ నెల 18న పోలింగ్ నిర్వహించి.. అదేరోజు రాత్రి ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తారు.